నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | సెప్టెంబర్ 28, 2024 | www.navatelangana.com

పాఠశాలల అభివృద్ధికి కృషి



బోథ్ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ప్రహరీగోడ నిర్మాణానికి రూ.5లక్షలతో భూమి పూజ చేశారు. అనంతరం పాఠశాలలోని వంటగదిని సందర్శించారు. విద్యార్థినులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనాలతో పాటు మంచి విద్యను అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం మోడల్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో వారి సమస్యలు తెలుసుకున్నారు. అదనపు గదులు, హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురేందర్, కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు ప్రవీణ్, రమణ గౌడ్, రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ - హాజీపూర్



మండలంలోని పెద్దంపేట్ గ్రామానికి చెందిన బెడద కార్తీక్(28) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం..కార్తీక్ ఆన్లైన్ గేమ్‌లో డబ్బులు పెట్టి నష్టపోయి అప్పుల పాలయాడు. అప్పులు తీర్చ లేక ఈ నెల 14న పొలం వద్ద గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య స్రవంతి, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

కౌలు రైతు గుర్తింపు ఎలా..?

- ఇప్పటికీ అధికారులకు అందని ఆదేశాలు
- రైతు భరోసా వర్తింపుపై అన్నదాతల్లో ఆందోళన
- ఖరీఫ్ సీజన్ పూర్తికావచ్చినా.. సర్కారు నుంచి స్పష్టత కరువు

వాస్తవ సాగులో ఉంటూ..రైతుతో సమానంగా వ్యవసాయం చేస్తున్న కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కౌలు రైతుల గుర్తింపునకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులతో పాటు కౌలు రైతులకు సైతం రైతు భరోసా వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా వీరి గుర్తింపు ప్రక్రియ చేపట్టడం లేదు. అధికారులకు సైతం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ కాకపోవడంతో గుర్తింపు ప్రక్రియ చేపట్టలేదని చెబుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ పూర్తికావస్తుండటం..మరో రెండు రోజుల్లో రబీ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఖరీఫ్‌కు సంబంధించి పెట్టుబడి సాయం కూడా దరిచేరకపోవడంతో ఎప్పుడొస్తుందా..అని రైతులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అన్నదాతలకు పంట పెట్టుబడి భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించి ఆదుకునే ప్రయత్నం చేస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎకరానికి రూ.5వేల చొప్పున ఖరీఫ్, రబీ సీజన్లకు గాను ఏడాదికి రూ.10వేలు అందించాయి. దీంతో రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయకుండా కొంత వరకు ఉపయోగపడ్డాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కింద ఎకరానికి రూ.ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా..ప్రభుత్వం నుంచి స్పష్టత రావడం లేదు. మరోపక్క ఇప్పటికే మూడు విడతల్లో రూ.2లక్షల రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేయగా.. బ్యాంకు తప్పదాలు, సాంకేతిక కారణాలతో కొంతమందికి రుణమాఫీ జమకాలేదు. మరోపక్క రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులకు ప్రభుత్వం త్వరలోనే మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సుమారు 3 నుంచి 4 నెలల పాటు రుణమాఫీపైనే ప్రభుత్వం పూర్తిగా దృష్టి కేంద్రీకరించడంతో రైతు భరోసాను పక్కనపెట్టిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు..!

ఉమ్మడి జిల్లాలో గత సర్కారు లెక్కల ప్రకారం 1,76,268మంది కౌలు రైతులు ఉండగా ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 28,763మంది, నిర్మల్‌లో 33,212మంది, మంచిర్యాలలో 28,584మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 26,754మంది ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు సైతం ఏడాదికి రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని హామీనిచ్చింది. కానీ ఇప్పటికీ గుర్తింపు ప్రక్రియ మాత్రం చేపట్టడం లేదు. వీరి గుర్తింపుపైనే సర్వత్రా సందిగ్ధం నెలకొంది. భూ యజమానుల నుంచి ఏదైనా పత్రం తీసుకోవాలా..? లేదంటే దరఖాస్తులో కౌలురైతు కాలమ్ పెడుతుందా..ఎలా గుర్తిస్తారనేదిపై ఎవరికీ స్పష్టత లేకుండా పోయింది. అధికారులు క్షేత్రస్థాయిలో పంటల వారీగా సర్వే చేసి రైతుల వివరాలను సేకరిస్తేనే వాస్తవ రైతులు ఎవరు.. కౌలు రైతులు ఎవరో తెలిసేందుకు అవకాశం ఉంటుంది. కానీ ప్రభుత్వం నుంచి



ఇప్పటికీ ఆదేశాలు జారీ కాకపోవడంతో వ్యవసాయ అధికారులు సైతం స్పష్టతనివ్వలేకపోతున్నారు. మరోపక్క ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసిపోనుండటంతో ఈ సీజన్‌లో రావాల్సిన రైతు భరోసా నిధులు సైతం ప్రభుత్వం విడుదల చేయడం లేదు. రైతులెవరికీ ఈ ఖరీఫ్‌కు పెట్టుబడి సాయం దక్కలేదు. మరో రెండు రోజుల్లో రబీ సీజన్ ప్రారంభం కానుండటంతో రైతులు పెట్టుబడి సాయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆలస్యమైనా సాయం దక్కుతుందనే భరోసాతో ఉన్నారు. ప్రభుత్వమే స్పష్టతనివ్వాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

త్వరగా గుర్తింపు చేపట్టాలి : సతీష్‌రెడ్డి, రైతు, తాంసి



గ్రామంలో తనకున్న సొంత భూమికి తోడు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాను. ప్రభుత్వం కౌలు రైతులకు కూడా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తామని హామీనిచ్చింది. కానీ ఇప్పటి వరకు గుర్తింపు ప్రక్రియ మాత్రం చేపట్టడం లేదు. త్వరగా గుర్తింపు చేపట్టి కౌలు రైతులందరికీ పెట్టుబడి సాయం అందించాలి.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు : శ్రీధర్‌స్వామి, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్

కౌలు రైతుల గుర్తింపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు. దీనికి సంబంధించి ఎలాంటి స్పష్టత లేదు. అక్కడ్నుంచి ఆదేశాలు రాగానే గుర్తింపు ప్రక్రియ చేపట్టి ప్రభుత్వానికి నివేదిస్తాం.

గురుకుల పాఠశాల తనిఖీ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించారు. ఆమెకు అర్చకులు పూర్ణ కుంభం స్వాగతం పలికారు. నాగోబా మోమెంటోను బహుకరించారు. అనంతరం మెండపల్లి చౌరస్తాలోని బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి 6వ తరగతి విద్యార్థినులకు ప్రశ్నలు వేశారు. విద్యార్థినులు ఏ ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కింద ఫ్లోర్‌లో అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ వచ్చినప్పుడు తీరు మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. బాలికలకు ఆపదలో 1098కు టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఆమె వెంట కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

చిన్నారులతో కలిసి కలెక్టర్ భోజనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే, డ్రై డే సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా అంకోలి గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రై డే డ్రై డే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని, ఇంటి పరిసరాల్లో ఉన్న కుండీలు, డ్రమ్ములు, వాడుకలో లేని వస్తువులలో నీరు నిల్వ ఉంటే దోమలు, ఈగలు చేరి అనారోగ్యానికి గురిచేస్తాయని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం సందర్శించి ఫైనల్ ఓటరు జాబితాను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి భోజనం చేశారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పద్మభూషణ్, డిఆర్‌డిఓ సాయన్న, డిఎల్‌పిఓ ఫణీంద్ర, ఎంపిడిఓ నాగేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారులు, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

విద్యార్థులతో అధికారి బస



నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఏఎస్‌సిడిఓ నారాయణరెడ్డి గురువారం రాత్రి విద్యార్థులతో కలిసి వసతి గృహంలో బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శ్రద్ధతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఆయన వెంట వార్డెన్ ఎం.నారాయణ ఉన్నారు.

డీఎల్ఎస్ఏ వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కేఆర్కే కాలనీలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. శిబిరాన్ని శుక్రవారం డీఎల్ఎస్ కార్యదర్శి సౌజన్య ప్రారంభించారు. రోగులను పరీక్షిస్తున్న తీరును పరిశీలించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి.గంగారాం, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అర్గుల అశోక్, ప్యానల్ న్యాయవాది అజయ్, వైద్యులు పాల్గొన్నారు.

ఇంటింటికీ భగీరథ నీరు అందాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఇంటింటికీ భగీరథ నీరు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ భగీరథ గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి భగీరథ నీరు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరారు.

అట్టహాసంగా జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు

నవతెలంగాణ-ఉట్నూర్



జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు శుక్రవారం కేబి కాంప్లెక్స్ మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిణి కుష్బూ గుప్తా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా క్రీడలకు రూ.325 కోట్లు కేటాయించిందన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో పెద్ద ఎత్తున సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్‌జిఎఫ్ క్రీడల నిర్వహణకు నిధులు కేటాయించామని పేర్కొన్నారు. ఈ ఏడాది గిరిజన రాష్ట్ర స్థాయి క్రీడలను ఏర్పాటు చేశామని వివరించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పోటీలకు చక్కటి ఏర్పాట్లు చేశారని ప్రశంసించారు. రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలకు విజయవంతంగా నిర్వహించేలా చూడాలని కోరారు. అనంతరం 400 మీటర్ల పరుగు పందాన్ని ప్రారంభించారు. విల్లు ఎక్కుపెట్టి విలు విద్య పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా పాఠశాల హాకీ క్రీడాకారుల ప్రదర్శించిన నృత్యం అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీర సంకేత్, ఏపీవో వసంతరావు, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, బుక్య రమేష్, ఏటీడీవోలు క్రాంతి, అమిత్, నిహారిక, ప్రధానోపాధ్యాయులు ఆర్. ప్రకాష్, ఆత్రం భాస్కర్, ప్రేమ్‌దాస్, కృష్ణారావు, ఉత్తందాస్ పాల్గొన్నారు.

హరితవనంలో ఫొటోగ్రఫీ ప్రదర్శన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మావల హరిత వనంలో వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో రెండు వందల వరకు పక్షులు, వన్యప్రాణుల ఫోటోలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమానికి ఎఫ్ఆర్‌ఓ గులాబ్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఫోటోలను తిలకించి కృష్ణ పని తీరును మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా గులాబ్‌సింగ్ మాట్లాడుతూ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని హరితవనంలో ఈ ఫోటోగ్రఫి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలో రెండు వందలకుపైగా వివిధ రకాల పక్షులతో పాటు వన్యప్రాణుల ఫోటోలు తీస్తూ వాటి అవశ్యకతను బయటి ప్రపంచానికి చాటి చెప్పడం నిజంగా అభినందనీయమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ ఇబ్రహీం, బీట్ ఆఫీసర్ జోత్స్న, సిబ్బంది నారాయణ, గంగన్న, రాకేష్, భోజన్న, రాహుల్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం



ముథోల్ : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముథోల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. నెలకు 2 సార్లు ఆసుపత్రిని సందర్శిస్తానని చెప్పారు. ఆసుపత్రి పైకప్పు, కిటికీలు, గదులు పరిశీలించి వాటికి మరమ్మత్తులు చేస్తామని తెలిపారు. భైంసా ఆసుప్రతి తరహాలో సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైతే విరాళాల సేకరణ, ముథోల్ గ్రామస్తుల సహకారంతో పాటు అవసరమైతే సొంత నిధులతో ఆసుప్రతికి పూర్వ వైభవానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిల్ జాదవ్, వైద్యులు సువర్ధన్, రాహుల్, మున్నూరు కాపు సంఘం తాలుకా అధ్యక్షుడు రోళ్ల రమేష్, బిజెపి మండల అధ్యక్షుడు కోరి పోతన్న, విడిసి అధ్యక్షుడు నారాయణ, నాయకులు నర్సాగౌడ్, దేవోజీ భూమేష్, తాటివార్ రమేష్, సుదర్శన్, శ్రీనివాస్, ఎస్.పోతన్న, దశరథ్, సంతోష్, మోహన్ యాదవ్, సతీష్‌రెడ్డి, మదన్ మోరె పాల్గొన్నారు.

సీజన్ ప్రారంభానికే ముందు చర్యలు

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పత్తి మార్కెట్ ఆసియాలోనే పేరు గాంచిందని, సీజన్ ప్రారంభానికి ముందు అన్ని చర్యలు తీసుకొని కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మార్కెటింగ్ ఏడీ కార్యాయల సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాటన్ సీజన్ ప్రారంభంపై అధికారులకు సూచనలు చేశారు. ప్రారంభం నాటికి అన్ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తి మార్కెట్‌కు ఆదిలాబాద్ పెట్టింది పేరని, జిల్లా వాసి కావడంతో ఇక్కడి పరిస్థితులపై అవగాన ఉందని తెలిపారు. పత్తి సీజన్ త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజన్ ప్రారంభం సమయంలో అన్ని కాంటాలు, తేమ పరికరాలను సన్నద్ధం చేసుకోవాలని సూచించామన్నారు. అదే విధంగా జిన్నింగ్ మిల్లులు కూడా సిద్ధం అయ్యేలా చూడాలన్నారు. ఎక్కడా రైతులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజియన్ డిప్యూటి డైరెక్టర్ పద్మావతి, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ కార్యదర్శులు అశ్వక్, శ్రీనివాస్, షాబుదొద్దీన్, గజానంద్ పాల్గొన్నారు.

ఖానాపూర్ చెరువు సర్వేను అడ్డుకున్న కాలనీవాసులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రెండు రోజులుగా పట్టణంలోని ఖానాపూర్ చెరువులోని అక్రమణాలను గుర్తిస్తూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. దీని కోసం కలెక్టర్ రాజర్షి షా మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో ఒక బృందం తయారు చేశారు. ఇలా నాలుగు బృందాలను ఏర్పాటు చేసి ఖానాపూర్ ఎఫ్‌టిఎల్ బౌండ్రిలను గుర్తించేందుకు సర్వే చేయాలని సూచించారు. రెండవ రోజు శుక్రవారం ఖానాపూర్, అంబేద్కర్‌నగర్ కాలనీల మధ్యలో సర్వే కొనసాగించారు. ఇండ్లు కూలుస్తారంటూ కాలనీ వాసులు పలువురు సర్వేను అడ్డుకున్నారు. తాము ఎట్టి పరిస్థితుల్లో సర్వేలు చేయించబోమని స్పష్టం చేశారు. కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూలిస్తే ఊరుకునేది లేదని అధికారులను హెచ్చరించారు. అంతకు ముందు అధికారులు ఇండ్ల వద్దకెళ్లి వారి పేర్లు, రేషన్ కార్డు, నిర్మాణ ఏరియా, ఎప్పటి నుంచి ఉంటున్నారు.. తదితర వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ ప్రేమ్‌సింగ్ మాట్లాడుతూ మ్యాప్ ప్రకారం ఖానాపూర్ చెరువు 144 ఎకరాల 30 గుంటలు ఉందన్నారు. ఎంటీటీలోని ఎఫ్‌టిఎల్ బౌండరీలో అక్రమ ఇండ్ల నిర్మాణాలు జరిగాయని, వాటి గురించి తెలుసుకోవడానికి కలెక్టర్ ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారని తెలిపారు. ఏరియాల్లో పర్యటించి కొలతలను తీసుకొని కలెక్టర్‌కు అందిస్తామన్నారు. మురుగు నీటిని శుద్ధి చేసే కేంద్ర ప్రభుత్వ ఎస్పీజీ కూడా రానుందని తెలిపారు. అందుకే ముందస్తుగా అన్ని సర్వేలు చేసి నివేదిక సిద్ధం చేస్తున్నామని స్పష్టం చేశారు.

లంబాడ హక్కుల జాగృతి కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

లంబాడ హక్కుల జాగృతి సమితి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బానావత్ సంతోష్ నాయక్, గౌరవ అధ్యక్షులుగా లకావత్ నందునాయక్, వర్కింగ్ అధ్యక్షులుగా పవర్ దినేష్ నాయక్, ఉపాధ్యక్షులుగా బుక్య సంతోష్ నాయక్, బానావత్ రాజు నాయక్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ ఎన్నికయ్యారు. మరికొంత మంది నాయకులతో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అజ్మీర బిమ్లాల్ నాయక్, బాదావత్ ప్రకాష్ నాయక్, జాదవ్ సందేశ్ నాయక్, శంకర్ లకవాత్, తిరుపతి బనవత్, రాములు నాయక్, సాయికిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రానికి చెందిన దాసరి శ్రీనివాస్, రజిత రెండు నెలల వ్యవధిలోనే మృతి చెందారు. దీంతో ఇద్దరు పిల్లలు మేఘన, రిశ్వాంత్ అనాధలుగా మారారు. విషయం తెలుసుకున్న సాయి వైకుంఠ ట్రస్ట్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పిల్లల పేరిట రూ.10వేలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ రవి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా ఎందరో పేద పిల్లలకు తన వంతుగా ఏదో ఒక రూపంలో సహాయ సహకారాలను అందజేస్తూ ఆదుకుంటున్నామని తెలిపారు. విద్య, వైద్య పరంగా ఏదైన సాయం కావాలంటే ట్రస్ట్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు మహేందర్, పోశాలు, రవి, రాజన్న, రాములు, పెంటన్న, బాలాజీ, విజయ్ పాల్గొన్నారు.

నాగోబాను దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయాన్ని శుక్రవారం ట్రైనీ కలెక్టర్ అజ్మీరా సాకేత్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా నాగోబా చరిత్రను మెస్రం వంశీయులను అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ మెస్రం నాగనాథ్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట హార్టికల్చర్ అధికారి సందీప్, మెస్రం మనోహర్ ఉన్నారు.



వార్షిక మహాజన సభ

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని సహకార సంఘంలో శుక్రవారం చైర్మన్ సాబ్లే కిషోర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించి సంఘం అభివృద్ధిపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేసే విధంగా దృష్టి సారించాలన్నారు. ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగభూషణ్ మాట్లాడుతూ సోయా కొనుగోలు కేంద్రానికి సంబంధించి స్థలం తక్కువగా ఉందని తెలిపారు. సహకార సంఘం అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ కిషోర్, బోథ్ మార్కెట్ వైస్ చైర్మన్ వసంత్ రావ్, గంగన్న సంతోష్ పాల్గొన్నారు.

తాత్కాలికంగా రోడ్డుకు మరమ్మతు

నవతెలంగాణ-నార్నూర్



ఇటీవ వల్ల కురిసిన భారీ వర్షంతో మండలంలోని మాలేపూర్ చిత్తగూడ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు కల్వర్టు ధ్వంసామైంది. రెండు రోజుల క్రితం ఎంపీడీఓ జవహర్ లాల్‌ను నవతెలంగాణ కోరగా స్పందించి పంచాయతీ శాఖ అధికారులతో మాట్లాడి శుక్రవారం గ్రామానికి వెళ్లే రోడ్డు కల్వర్టును తాత్కాలికంగా మట్టి వేయించారు. దీంతో గ్రామస్థులకు రాక పోకలను పునరుద్ధరించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి రాజన్న గ్రామస్తులున్నారు.

ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన బాపూజీ

- కలెక్టర్ రాజర్షి షా
- అధికారికంగా బాపూజీ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఉద్యమంలో ఆచార్య కోండ లక్ష్మణ్ బాపూజీ కీలకంగా వ్యవహరించారని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం కోండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతితిగా హాజరై బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయంతి వేడుల్లో పాల్గొన్న అతితులను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో అనేక మంది ఉద్యమకారులకు కొండ లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తిని ఇచ్చారని అన్నారు. బడుగుబలహీన వర్గాల ప్రభుత్వం కూడా అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. హ్యాండ్ లూం టెక్నాలజీ సంస్థలకు ఆయన పేరు పెట్టి ప్రభుత్వం గౌరవించిందన్నారు. కొండ లక్ష్మణ్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. అదే విధంగా కొత్త కలెక్టరేట్ కు కొండ లక్ష్మణ్ పేరును పెట్టాలని పద్మశాలి సంఘం అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ కోరారు. మంత్రి సీతక్కతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ బంగ్లా సమీపంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. జడ్పీ, మున్సిపల్ చైర్మెన్‌లు జనార్ధన్ రాథోడ్, జోగు ప్రేమేందర్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు నారాయణ, జగదీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళ్లు

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ నాయకురాలు ఆత్రం సుగుణక్క, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో కలిసి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించి అయన సేవలను కొనియాడుతూ నినాదాలు చేసారు. కార్యక్రమంలో యువజన జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ గౌడ్, ఉపాధ్యక్షులు వేముల నాగరాజ్, మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, ఎస్టీ సెల్ చైర్మన్ సేడ్మాకి ఆనంద్ రావు, నలిమేలా నవీన్ రెడ్డి, సునీల్ జాదవ్, రూపేష్ రెడ్డి, సవిన్ రెడ్డి, పోత రెడ్డి పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



తాంసి

కామర్స్ కళాశాలలో బాపూజీ జయంతి

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం పాల్గొని బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి రఘు, ఎన్‌సీసీ కేర్‌టేకర్ చంద్రకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి పృథ్వీరాజ్, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

కుభీర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నవనీత్ కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోముతో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయంలో శుక్రవారం కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ముందుగా కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఎంపీఓ మోహన్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి, అధికారులున్నారు.

ఖానాపూర్ టౌన్ : కొండ లక్ష్మన్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చైర్మెన్ చిన్నం సత్యం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జన్నారపు శంకర్, పరిమి సురేష్, నాయిని సంతోష్, తోట సత్యం, మున్సిపల్ మేనేజర్ సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొండ లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళశాల ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, విఠల్, ప్రమీల, సాయినాథ్, హరీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. మందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ, సోమన్న, గోవేర్ధన్, బాలాజీ, శ్రీనివాస్, భాస్కర్, రాజేశ్వర్, నాగభూషన్, మాదవి, ప్రవీణ పాల్గొన్నారు.

తాంసి : తాంసి, భీంపూర్ మండల ప్రభుత్వ కార్యాలయంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. మొదటగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయంతి సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ, ప్రిన్సిపాల్ సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్ నరేశ్, ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సిబ్బంది లలిత, అశోక్, అడెల్లు, స్వాగత్, రాహుల్, ప్రశాంత్, ప్రవీణ్, రఫీక్, అశోక్ పాల్గొన్నారు.

బోథ్ : ఆచార్య కొండ లక్ష్మణ్ అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో గల కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికుంట్ల ఆశమ్మ, పట్టణ అధ్యక్షుడు భోజాన్న, మండల అధ్యక్షుడు అసల సదాశివ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు బలరాం జాదవ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని ఆయా గ్రామాల పంచాయితీ కార్మికులకి శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిఓ సంతోష్ కుమార్,పంచాయితీ కార్యదర్శి అరుణ్,వైద్య సిబ్బంది మహేష్,గంగారాం,సుశీల,ఆశ వర్కర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గోండి లిపి పండితుడి సేవలు మరువలేనివి



నవతెలంగాణ-నార్నూర్

గోండి లిపిని భద్రపరిచి గోండు భాషా గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయడంలో కొట్నాక్ జంగు కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుంజాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన కోట్నాక్ జంగుతో పాటు అర్క జైవంతరావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోండు సమాజాన్ని చైతన్య పరచడానికి గోండి లిపిని తయారు చేయడం గర్వకారణమన్నారు. కొట్నాక్ జంగు మృతి సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

అధిక బిల్లుపై రోగి బంధువుల ఆందోళన

- ప్రయివేట్ ఆస్పత్రి ఎదుట బైటాయింపు



నవతెలంగాణ-ఖానాపూర్

అనారోగ్యం వచ్చిందని ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లే అధిక బిల్లు వేశారని రోగి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టిన పట్టణంలో జరిగింది. శుక్రవారం ఖానాపూర్ పట్టణానికి చెందిన మల్లవ్వ ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్యం కోసం వెళ్లింది. చీటీపై మందులు రాసి ఆస్పత్రిలో చేరింది. తూతూ మంత్రంగా వైద్య నిర్వహించి ఎక్కువ డబ్బులు అడిగారని సరైన వైద్యం కూడా చేయలేదని బాధితురాలు ఆరోపించింది. ఈ విషయమై సరైన వైద్యం చేయకుండా అధిక బిల్లు వేశారని రోగి బంధువులు ఆందోళన చేపట్టారు. అనంతరం యాజమాన్యాన్ని నిలదీయగా తెల్ల కాగితంపై బిల్లు వేసి ఇచ్చారని బాధితురాలు తెలిపారు. అంతే కాకుండ వైద్యం చేసే మహిళా వైద్యురాలికి ఎంబీబీస్ కూడా పూర్తి కాలేదని ఎలాంటి అర్హత లేని వైదిరాలితో చికిత్సలు చేయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న నిర్మల్ డీఎంహెచ్ఓ సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేసి మహిళ వైద్యురాలికి అర్హత లేదని ఆమె వైద్యం చేయరాదన్నారు. ఈ ఘటనపై ఆ ఆస్పత్రికి జరిమానా విధిస్తామన్నారు.

పోషకాహారంపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

- మహిళా కమిషనర్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కారణం లేకుండా ప్రభుత్వాలు ఎలాంటి కార్యక్రమాలు చెపట్టవని, పోషకాహారంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని మహిళ కమిషనర్ రాష్ట్ర చైర్పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. పోషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టీటీడీసీలో పోషకారహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు పోషక విలువలతో కూడిన భోజన ప్రదర్శనను కమిషన్ చైర్పర్సన్ ప్రారంభించారు. ఆమెతో పాటు కలెక్టర్ స్టాళ్లను సందర్శించి రుచులను చూశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం టీటీడీసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళ కమిషనర్ రాష్ట్ర చైర్పర్సన్ నేరెళ్ల శారద మాట్లాడుతూ పూర్వీకుల కాలంలో కూర, పప్పు, ఆకు కూరాలు తినేవారని, కానీ ఇప్పుడు పౌష్టికాహారం గురించి తెలియడం లేదన్నారు. పౌష్టికాహారం లేని కారణంగా రక్తహీనత, ఇతర వ్యాధులు వస్తున్నాయన్నారు. పురుషులు, స్త్రీలు సమానమే అయిన, మహిళల్లో వివిధ దశల్లో పలు మార్పులు వస్తాయన్నారు. ఆ సమయంలో సరైన పౌష్టికాహారం అవసరమన్నారు. అందుకే పోషణ మా కార్యక్రమాన్ని తీసుకువచ్చామన్నారు. ఇందులో అంగన్వాడీలను మమేకం చేయడానికి పెద్ద కారణం ఉందన్నారు. గ్రామంలో ఏది తెలుసుకోవాలన్న అది అంగన్వాడీ నుంచే అనే నానుడి ఉందన్నారు. గ్రామ స్థితిగతులతో పాటు కుటుంబ విషయాలు కూడా అంగన్వాడీల వద్ద ప్రజలు చర్చిస్తారన్నారు. పోషణ విజయవంతం చేయడంలో అంగన్వాడీల బాధ్యత కీలకంగా ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ మారుతున్న కాలనీకి అనుగుణంగా ప్రతి ఒక్కరు ప్యాకేజి ఫుడ్ కు ఎక్కువ మక్కువ చూపుతున్నారన్నారు. అందులో సోడియాం ఎక్కువగా ఉండడంతో కమ్యూనికేబుల్ వ్యాధులతో పాటు ఇతర వ్యాధులు కూడా వస్తున్నాయన్నారు. ఇంట్లో ఉన్న సమయంలో అన్ని జాగ్రత్తలు పాటిస్తున ప్రజలు బయటి వచ్చిన వాటిని విస్మరిస్తున్నారన్నారు. దాని కారణంగా రకరకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. పోషక విలువ గల ఆహారాన్ని అందేలా ప్రభుత్వం పోషణ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరీబాయి, జడ్పీ డిప్యూటి సీఈఓ కలిందిని, డీడబ్ల్యూఓ సబిత, ఏడీసీ మిల్క్, మెప్మా పీడీ మమత, సుబ్రత, విజయలక్ష్మీ, కమల, కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంజు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు గిమ్మ సంతోష్, రూపేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు నేర చట్టాల సవరణ రద్దుకు కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, స్కీం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 30న జరిగే చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ నారాయణ కోరారు. శుక్రవారం పట్టణంలో కుమురంభీం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని అన్నారు. స్వదేశీ జాతీయత దేశభక్తి పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ఆస్తులను సహజ వనరులను ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అమ్మి వారి ఆస్తులు సంపదను పెంచుతుందన్నారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద జరిగే భారీ ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో ఐఎఫ్టీయూ నాయకులు శేషారావు, నర్సింగ్, దేవిదాస్, అఖీల్, జనార్ధన్ పాల్గొన్నారు.

పరిసరాల పరిరక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ-భైంసా

పరిసరాలను కాపాడుకోవడం అందరి బాధ్యతని భైంసా డివిజనల్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ వి.దిలీప్ కుమార్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పోస్టల్ ఉద్యోగులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టాలన్నారు. స్వచ్ఛతతోనే రోగాలు ధరిచేరవని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఈ రెండు విషయాల్లో ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. పోస్టల్ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల్లో తాము పనిచేసే ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. చెట్లను నాటడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం పట్ల ప్రజలను చైతన్య పరచాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో భైంసా, ముధోల్ ఎస్పీఎంలు నర్సయ్య, గంగయ్య, పోస్టల్ మెయిల్ ఓవర్సీస్ నరేష్ పాల్గొన్నారు.

బోథ్ : మండలకేంద్రంలోని సివిల్ కోర్టులో శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జడ్జి బి హుస్సేన్ ఆధ్వర్యంలో స్వచ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి హుస్సేన్ మాట్లాడుతూ మనతో పాటు చుట్టున్న పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవ్యాధి కుమ్మరి విజయ్ కుమార్, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి, సిబ్బంది మజీద్, శ్రీకాంత్, కోర్టు పోలీస్ పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా అన్నారు. శుక్రవారం మండలంలోని ఆశ్రమ పాఠశాలను పీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల పచ్చి ఆకు కూరగాయల ఆహారంతో పాటు గుడ్లు, పాలు రాగి మాల్టా అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీరా సాకేత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోనాపూర్‌లో వైద్య శిబిరం



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని బెతల్‌గూడ గ్రామపంచాయితీ పరిధిలోని సోనాపూర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 9 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేయించి ఉచిత మందులు పంపిణీ చేశారు. రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గర్భిణీలు పౌష్టిక ఆహారంతో పాటు పాలు, చేపలు, గుడ్లు, ఆకుకూరలు ఐరన్, క్యాల్షియం మాత్రలు తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్లు చౌహన్ చరణ్ దాస్, గణేష్ కుమారి సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ ప్రియాంక, వైద్య సిబ్బంది విమల, కైలాష్, జవహర్, ఆశా కార్యకర్తలు మాన్కు బాయి, అంగన్‌వాడీ టీచర్ జాదవ్ విమల ఉన్నారు.

అత్యాశతో యూబిట్ కాయిన్ దందా...

- కేసుల్లో ఇరుక్కున్న ఉపాధ్యాయులు
- డబ్బు వ్యామోహంలో జైలుకు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఉపాధ్యాయులు అంటేనే సమాజంలో ఎంతో గౌరవం ఉంటుంది. అయితే కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు డబ్బు వ్యామోహంలో పడి పరువు తీసుకుంటున్నారు. నెలకు రూ.లక్ష దాక వచ్చే వేతనం సరిపోనట్టు చట్టబద్ధత లేని యూబిట్ కాయిన్‌లో ఇరుక్కొని జైలు ఊచలు లెక్కపెడుతున్నారు. యూబిట్ కాయిన్ దందాలో నెల రోజుల కింద ఐదుగురు ఉద్యోగులు అరెస్ట్ కాగా మూడురోజుల కింద మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఖానాపూర్ పట్టణంలోని సాయినగర్‌కు చెందిన కడెం మండలంలో విధులు నిర్వహించే ఓ ఉపాధ్యాయుడు అరెస్ట్ కావడం గమనార్హం. ఉపాధ్యాయుని అరెస్ట్ పట్టణంలో కలకలం రేపుతోంది. ఈ అక్రమ దందాలో ప్రమేయం ఉన్న ఇతర ఉద్యోగులను సైతం అరెస్ట్ చేస్తారన్న చర్చ జరుగుతోంది. పెంబిలో విధులు నిర్వహిస్తున్న విద్యానగర్ కాలనీకి చెందిన ఓ ఉపాధ్యాయుడు సైతం ఈ దందాలో స్టార్‌గా అవకాశం పొందినట్లు సమాచారం. చైన్ సిస్టంలో సాగే యూబిట్ కాయిన్ దందాలో స్టార్ హోదా రావడంతో సదరు ఉపాధ్యాయుడు గతంలో విదేశీ పర్యటనకు వెళ్లివచ్చినట్లు చెబుతున్నారు. ఉపాధ్యాయుడు కావడం వల్ల ఈయన చెప్పిన మాటలు నమ్మి పలువురు అమాయకులు ఈ యూబిట్ కాయిన్ చైన్ సిస్టంలో ఇరుక్కొని నష్టపోయారు.

ఉపాధ్యాయుని అరెస్టుతో భయం

మూడురోజుల కింద సాయినగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు అరెస్టు కావడంతో యూబిట్ కాయిన్ దందాతో సంబంధం ఉన్న మండలంలోని ఇతర ఉద్యోగుల్లో భయం నెలకొంది. ఏ సమయంలో తమను ఎవరు పట్టుకెళ్తారో తెలియని ఆందోళనతో గడుపుతున్నట్లు చెబుతున్నారు. సదరు ఉపాధ్యాయులు తాము విధులు నిర్వహిస్తున్న పాఠశాలకు కూడా సకాలంలో హాజరు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంట్లో నుంచి బయట పడేందుకు ఏమైన అవకాశం దొరుకుతుందన్న ఆశతో పైరవీ దారులను కలుస్తున్నట్టు సమాచారం. ఎంతో కష్టపడితే గాని రాని గౌరవ ప్రదమైన ప్రభుత్వ ఉద్యోగాన్ని లెక్క చేయకుండా ఉపాధ్యాయులు ఇలాంటి యూబిట్ కాయిన్ వ్యాపారం చేయడాన్ని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఖానాపూర్ ఎంఈఓగా ప్రేంసాగర్

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

మండల విద్య అధికారిగా ప్రేంసాగర్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఆయనకు శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యంను మర్యాద పూర్వకంగా కలిశారు. పాఠశాలల్లో విదాయార్థులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు మంచి బోదన అందించి మండలానికి మంచి పేరు తేవాలని కోరారు.

నవతెలంగాణ
నవతరం తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | సెప్టెంబర్ 28, 2024 | www.navatelangana.com

గ్రామ సమస్యలు పరిష్కరించాలని

• రోడ్డుపై నిలిచిన మురుగు నీటి వద్ద నిరసన

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని హత్తిని గ్రామ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డుపై నిలిచిన మురుగు నీటి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా నాయకురాలు కుందరం మంజుల మాట్లాడుతూ గ్రామ సమస్యలను పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై నీటి గుంతలను పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువలు నిర్మించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు శ్రీను, ప్రేమలత, భీమేష్, గంగ, అజయ్, నిహారిక, సుమలత పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసి టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



నూతనంగా కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి, జిల్లా కార్యదర్శి మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, మండల బాధ్యులు బాజీకాన్, కరిష్మా శ్రీలత, మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించి, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఇతర సమస్యలు వారికి విన్నవించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ జిల్లా కార్యదర్శి చాపిలే సాయి కృష్ణ, జిల్లా నాయకులు సిరికొండ నితీష్ పాల్గొన్నారు.

ఆదివాసీ పోరుగడ్డకు బస్సు పున:ప్రారంభం



నవతెలంగాణ-కెరమెరి

గిరిజన పోరాటయోధుడు కుమురం భీం నడయాడిన పోరుగడ్డ జోడేఘాట్‌కు ఆర్టీసీ బస్సు పున:ప్రారంభమైంది. 2014 నుండి 2019 వరకు ఉదయం సాయంత్రం నడిచిన బస్సు ఐదు సంవత్సరాల నుండి రద్దయింది. పోరాట యోధుడు నడయాడిన గడ్డకు బస్సు లేకపోవడంతో ఐదు సంవత్సరాల నుండి ప్రయివేటు వాహనాలపై ఆధారపడుతూ ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గమనించిన భీమ్ నూతన ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూరు రాజేశ్వర్ పలు దఫాలుగా ఆర్టీసీ అధికారులు, నాయకులకు సమస్యను వివరించగా డిపో మేనేజర్ విశ్వనాథ్ స్పందించి శుక్రవారం బస్సు జోడేఘాట్‌లో ప్రారంభించారు. దీంతో జోడేఘాట్, చాల్‌బడి, బాబాజేరితో పాటు పలు ఆదివాసీ గూడాలకు ఉపయోగకరంగా మారనుంది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ జోడేఘాట్‌కు రెండు పూటలు బస్సు నడుస్తుందనిఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో భీం మనవడు సోనేరావు, నాయకులు మారుతి, మారు, రాజు, లక్ష్మణ్, కనక ప్రభాకర్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కార్తీక్‌తో కలిసి నూతన జిల్లా విద్యాధికారి యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీలో ఉపాధ్యాయురాలను నియమకాలు చేపట్టాలన్నారు. ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీలపై వెళ్లిపోయారని దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఆదర్శ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. జిల్లాలో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్నారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలికి సన్మానం



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని మొగుడు దగడ్ కేబీ కాలనీలోని గిరిజన పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయురాలు గట్టు సుశీలను శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుఉపాధ్యాయురాలుగా పనిచేసి పిల్లలను సొంత పిల్లలుగా చూసుకున్నారని కొనియాడారు. ఇక్కడి నుండి బదిలీపై వెళ్లిపోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏటీడీఓ కమర్ హుస్సేన్, ఎస్సీ ఆర్‌పి మడావి పోచాని, మాజీ సర్పంచ్ పూర్వత్ జీజాబాయి, ప్రధానోపాధ్యాయులు రాములు సోము, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పక్కాగా అమలు చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలను పక్కాగా అమలు చేయాలని పెసా యాక్ట్ మండల మొబిలైజర్ భరత్ భూషణ్ అన్నారు. మండల తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావుకు ఆదివాసీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసులకు రక్షణగా ఉన్న పెసా, 1/70 చట్టాలు అమలుకు నోచుకోక ఆదివాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన చట్టాలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజనుల రక్షణ కోసం ఈ ప్రాంతంలో వ్యాపారం ప్రారంభించే సమయంలో కూడా పెసా కమిటీ ఆమోదం తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఆదివాసులకు రక్షణ దొరుకుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భూములను కూడా కాపాడాలని కోరారు. జీఓ నెంబర్ 3 అమలు చేయాలన్నారు. గిరిజన చట్టాల అమలులో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సెడ్మాకి తుకారం, నాయకులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-వాంకిడి

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన హీప్రే నాందేవ్(54) గత సంవత్సరం నుండి పక్షవాతం లక్షణాలతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

నిజాయితీగా పనిచేసే నాయకున్ని ఎన్నుకోండి

• సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మోసపూరిత వాగ్దానాలు చేసే రాజకీయ నాయకుల ఉచ్చులో పడి మోసపోకుండా నిజాయితీగా కార్మికులలో పనిచేసే నాయకుడిని ఎన్నుకొవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ (సీఐటీయూ) రన్ గ్రాండ్ లాడ్జిలో నిర్వహించిన కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి హాజరై కార్మికులకు మొదట అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులలో పనిచేసే ట్రేడ్ యూనియన్ నాయకులకు యజమాన్యంతో బేరమాడే శక్తితో పాటు విషయ పరిజ్ఞానం, నిజాయితీ ఉండాలన్నారు. పేపర్ మిల్లు చరిత్ర చాలా గొప్పదని ఇప్పటివరకు కార్మిక నాయకులుగా గెలిచినవారు కూడ పెద్దపెద్ద నాయకులు అయి ఉంటారని, మళ్లీ సంజీవరెడ్డిని అధ్యక్షుడిగా పోటీ చేయమని రమ్మంటే వస్తాడని తెలిపారు. మరొక నాయకుడు అధ్యక్షునిగా గెలిపిస్తే భద్రాచలం పేపర్ మిల్లు వేతనాలు ఇప్పిస్తానని అంటున్నాడని అతను గతంలో ఇదే మిల్లులో అధ్యక్షునిగా గెలిచినప్పుడు భద్రాచలం పేపర్ మిల్లు లేదా అని ప్రశ్నించారు. అప్పుడు ఇప్పించని భద్రాచలం వేతనాలు ఇప్పుడు ఇప్పిస్తాడా..? మోసపూరిత మాటలు, వాగ్దానాలకు కార్మికులు మోసపోవద్దని కోరారు. ట్రేడ్ యూనియన్‌లో అనుభవం లేని రాజకీయ నాయకులను, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఉన్న వారిని గెలిపిస్తే మోస పోతారని, గతంలో పెద్దపెద్ద నాయకులను గెలిపించుకొని మోసపోయారని గుర్తు చేశారు. దేశంలోని జెకె పేపర్ మిల్లు కార్మికుల వేతనాలతో పాటు ఇతర పేపర్ మిల్లు కంపెనీల వేతనాలు మన సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులకు తెలిసి ఉండాలని, సీఐటీయూని ఆదరించి గెలిపిస్తే ఆ సమాచారం మీ ముందు ఉంచి మెరుగైన వేతనాలు ఇప్పిస్తామన్నారు. మిల్లు మూత బడి తిరిగి తెరుచు కున్నప్పుడు పాత కార్మికులందరిని దశలవారీగా అందరినీ వీధిలోకి తీసుకోవాల్సి ఉండగా కొంతమంది కార్మికులను విధుల్లోకి తీసుకోలేదని, వారి స్థానాలలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించటం చట్టవిరుద్ధమన్నారు. ఒక కంపెనీలో ఒకసారి గెలిచిన యూనియన్ రెండవసారి గెలవటమే కష్టమని నేను వరుసగా నాలుగు సార్లు గెలిచి కార్మికులకు మెరుగైన వేతనం ఇప్పించి వారి జీవితాలలో వెలుగులు నింపానని, అందుకే తనను ఆదరించి వరుసగా గెలిపిస్తున్నారని, సిర్పూర్ పేపర్ మిల్లులో కూడా సీఐటీయూ జెండాను ఎగరవేసి మెరుగైన వేతనాలు పొందాలని కార్మికులకు సూచించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూశన రాజన్న, ఉపాధ్యక్షులు ముంజం శ్రీనివాస్, అంగల శ్రీనివాస్, రాజన్న, గడమళ్ళ మహేష్, రమేష్. రాజేందర్, సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

తెలంగాణ తొలి తరం ఉద్యమ నేత బాపూజీ

• కలెక్టర్ వెంకటేష్ దోత్రే
• ఘనంగా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ కోసం పోరాడిన తొలి తరం ఉద్యమ నేత ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారి సజీవన్ అధ్యక్షతన నిర్వహించారు. వేడుకలకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వరరావుతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'కన్నీళ్లతో కాదు కసితో తెలంగాణను సాధించాలంటూ' బాపూజీ చేసిన ఉద్యమ వ్యాఖ్యలు గుర్తు చేశారు. జిల్లాకు చెందిన బాపూజీ తొలితరం ఉద్యమ నేత కావడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటంతో పాటు తెలంగాణ ఉద్యమ నాయకుల్లో ఆద్యుడు బాపూజీ అని కొనియాడారు. పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనిలో భాగంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రూప్నర్ రమేష్, గౌరవ అధ్యక్షులు పొన్న రమేష్, బిజెపి నాయకులు కొంగ సత్యనారాయణ, బిసి సంఘం నాయకులు పందాల వెంకన్న, వైరాగడే రమేష్, మోర్ల తిరుపతి, సింగిల్ విండో చైర్మన్ ఆలీ బిన్ అహ్మద్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రేగుంట కేశవ్, పద్మశాలి సంఘం నాయకులు నల్లా కనకయ్య, హనుమల్ల కేదారి పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డివి శ్రీనివాసరావు లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విశ్రాంత ఉద్యోగ సంఘ భవనంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా నాయకులు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గరిపెల్లి కరుణగౌడ్, నాయకులు కానోజీ రమేష్, బండారి వెంకటేశం, దుర్గం తుకారాం, వంశీ, వెంకట్, వసంత్, సునీత పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అంకసాపూర్ గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో ఎంఆర్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్, బేడ బుడగ జంగాల రాష్ట్ర కార్యదర్శి పస్తం అంజయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు వడ్లూరి కిరణ్, రేగుంట శ్రావణ్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : కొండా లక్ష్మణ్ చిత్రపటం వద్ద వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

వాంకిడి : మండల కేంద్రంలో శుక్రవారం మాజీ మంత్రి, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి వేడుకలను లక్ష్మణ్ సేవా సదన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం సొసైటీ చైర్మన్ అవినాష్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో బాపూజీ పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి మండలాధ్యక్షుడు గాదె అనిల్‌కుమార్, దేవాదాయ కమిటీ మండలాధ్యక్షుడు గాదె ప్రవీణ్, వ్యాపారవేత్త శివకుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నులే నారాయణ, లక్ష్మణ్ సేవా సదన్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు మోల్కార్ అశోక్, కార్యదర్శి మడావి దౌలత్, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, జమల్‌పూరి సుధాకర్, జయరాం, దీపక్‌ముండె, మాజీ సర్పంచ్ తుకారాం పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలోని సలుగుపల్లిలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పద్మశాలి సేవా సంఘం నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షులు సామల తిరుపతి, ప్రధాన కార్యదర్శి తనికుట్ల వెంకటేష్, అవధూత సత్యనారాయణ, కొప్పుల దిలీప్, తేలి రాజేష్, భోగ విలాస్, పడాల సదాశి, కొంగ శంకర్, సామల వెంకటేష్ పాల్గొన్నారు.



వాంకిడి



బెజ్జూర్

ఉత్తమ ఫలితాల దిశగా కృషి చేయాలి : అదనపు కలెక్టర్



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-వాంకిడి

ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలలో నేషనల్ అచీవ్మెంట్ సర్వే, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ అచీవ్ మెంట్ సర్వే డిసెంబర్ 4వ తేదీన 3, 6, 9 తరగతులకు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు గాను విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా మరింత సాధన చేయించాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, సమయసారిణి పాటించాలని తెలిపారు. విద్యార్థులకు మాక్ టెస్టులు, వారంతపు పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని నిర్ణీత ప్రొఫార్మాలో నమోదు చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా బోర్డు మీద లెక్కలు వేసి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మండలంలోని సవాతి, డాబా పీఆర్ రోడ్డు కల్వర్టును పరిశీలించి పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి శివ చరణ్, పంచాయతీరాజ్ డీఈ, డివిజనల్ పంచాయతీ అధికారి, మండల పంచాయతీ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని టీఆర్ నగర్‌లో శుక్రవారం పేకాటరాయళ్లను అరెస్టు చేశారు. సీఐ సతీష్ తెలిపిన వివరాలు ప్రకారం శుక్రవారం ఉదయం ఆరు గంటలకు పట్టణంలోని టీఆర్ నగర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు షేక్ జావిద్, కడారి శ్రీధర్, జంబోజు మహేష్, పూసల అరుణ్ చారి, అరిగెల రవి, చిలుకూరి మహేష్, సిరికొండ కృష్ణమూర్తిలను అదుపులోకి తీసుకోని వారి వద్ద రూ. 14,190 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపిక

రెబ్బెన : గోలేటి సింగరేణి పాఠశాల క్రీడా మైదానంలో బాల్ బాడ్మింటన్ జిల్లా జట్లు ఎంపిక జరిగింది. ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఎస్ ఓ టూ జీఎం కె. రాజమల్లు పాల్గొని మాట్లాడుతూ క్రమశిక్షణతో మేలుగాలని, గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో కామారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని బాల్ బాడ్మింటన్ జనరల్ సెక్రటరీ ఆర్. నారాయణ రెడ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పలువురు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

రోడ్డుపై బైటాయించిన పార్ది గ్రామస్తులు



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని పార్డీ గ్రామానికి చెందిన గ్రామస్తులు రోడ్డు బాగు చేయాలని శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొడిపె ఆనంద్ రావు మాట్లాడుతూ వర్షాకాలంలో కలెక్టర్ మా రోడ్డును పరిశీలించి బాగు చేయిస్తానని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు ఈ రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ముత్యంపేట్ ప్రధాన రహదారి నుండి పార్డీ వరకు సుమారుగా నాలుగు కిలోమీటర్లు ఉంటుందని రోడ్డంతా గుంతల మయమై బురదతో కూడుకొని ఉండడంతో నడవలేని స్థితిలో ఉన్నామన్నారు. ఇదే రహదారిలో స్టోన్ క్రషర్లు ఉండడంతో అందులో కంకర అధిక లోడుతో లారీలు నడవడం ఈ రోడ్డు మరింత చెడిపోయిందని ఏ నాయకులు అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మా ఊరికి రోడ్డు బాగు చేయించి మాకు సౌకర్యం కల్పించాలని కోరారు. నిత్యం మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలకు వచ్చే పిల్లలు కాలినడకన రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని రోడ్డు సౌకార్యం లేక పిల్లలు చదువుకు దూరమయ్యే ప్రమాదాలున్నాయన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దౌలత్, గ్రామస్తులు ప్రభాకర్, సురేష్, సంజీవ్, ఆనంద్ రావు ఉన్నారు.

ఉపాధ్యాయులతోనే సమాజంలో మార్పు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో మార్పు ఉపాధ్యాయులతో సాధ్యమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారిలు అన్నారు. పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో మార్పు తీసుకురావడంలో ముందుండాలన్నారు. మంచి వైపు నడిపించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్ కుమార్, పెంచికలపేట్ మండల అధ్యక్షుడు గుండు యాదగిరి, ఆసిఫాబాద్ ప్రధాన కార్యదర్శి కుమ్మరి రవి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధభాయి, ప్రధానోపాధ్యాయులు సునీత, శ్రీనివాస్, మహేష్, చంద్రశేఖర్, రాహుల్, శ్రీశైలం పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపు ఉండాలి



నవతెలంగాణ-కౌటాల

పారిశుద్ధ్యంపై అందరికీ పట్టింపు ఉండాలని ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఓ దత్తారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వచ్ఛ తా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మండల కేంద్రంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించినంతరం మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రతి ఒక్కరికి పట్టింపు ఉండాలన్నారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే వ్యాధుల బారినపడి తీవ్రంగా నష్టపోతామన్నారు. అదేవిధంగా కళాశాల, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోట ప్రసాద్, ఏపీఓ పూర్ణిమా, ఏపీఎం ముక్తేశ్వర్, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి డ్రైవర్లకు, క్లీనర్లకు లాభాల్లో వాటా ఇవ్వాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థలలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్ పోర్ట్(బొగ్గు రవాణా) కార్మికులైన డ్రైవర్లు, క్లీనర్లతో పాటు అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా లాభాల్లో వాటా రూ.5000 చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి అధ్యక్షతన ధర్నా అనంతరం బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటూ జీఎంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలు సంస్థ అభివృద్ధి కేంద్రంలో కోల్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, క్లీనర్లు, కార్మికులతో పాటు అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయకపోవడంతో కాంట్రాక్టు కార్మికుడు శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు అరకిల్ల స్వామి, కార్యదర్శి బి లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, కోశాధికారి సతీష్, కార్మికులు రాజుకుమార్, రమేష్, శ్యామ్‌రావు, చంద్రకాంత్, రమేష్, శ్రీనివాస్, గోపాల్ పాల్గొన్నారు.

అక్టోబర్ 1న జోనల్ స్థాయి క్రీడలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఆయా డివిజన్ల పరిధిలో డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ముగిసిన నేపథ్యంలో అక్టోబర్ 1న గిరిజన ఆశ్రమ పాఠశాల జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల్ జిల్లా, ఆసిఫాబాద్, జైనూర్, కాగజ్ నగర్ డివిజన్‌లలో ఎంపికైన క్రీడాకారులందరూ సెప్టెంబర్ 30వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా గిరిజన క్రీడల అధికారి బండమీనారెడ్డికి రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

గ్రామంలో క్రమం తప్పకుండా మంచినీరు అందించాలి

నవతెలంగాణ-జన్నారం



గ్రామంలో క్రమం తప్పకుండా మిషన్ భగీరథ నీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశం అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని 29 గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు సిబ్బందికి ఇన్సూరెన్స్ చేశారు. మిషన్ భగీరథ డీఈ వెంకటేశం ఏఈ అబ్రహం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలో పనిచేస్తున్న వాటర్ సిబ్బందికి నీటి ట్యాంక్‌ల నిర్వహణ, మోటార్ రిపేర్‌ల గురుంచి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, ఎంపీఓ జలందర్ వివిధ గ్రామాలకు చెందిన పారిశుద్ధ కార్మికులు అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ మంచి నీటి సహాయకులకు శిక్షణ

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించే ఉద్దేశంతో మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్ వారి ఆధ్వర్యంలో గ్రామానికి ఒక మంచినీటి సహాయకుడిని నియమించగా వారికి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలలో మంచినీటి సరఫరా చేసేందుకు నూతనంగా నియమించిన సహాయకులకి సంబంధిత శాఖ అధికారుల ద్వారా అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లోని పైప్ లైన్ల లీకేజీ అరికట్టడం, క్లోరినేషన్, మంచినీటి ట్యాంకులు శుభ్రపరచడం మంచినీటి నాణ్యత పరీక్షలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈఈ నరేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీల మీద అక్రమ కట్టడాల తొలగింపు



నవతెలంగాణ-మందమర్రి

డ్రైనేజీల మీద అక్రమ కట్టడాలను శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. మార్కెట్ వేణుగోపాల్ డిష్ లైన్‌లోని రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీల మీద అక్రమంగా నిర్మించిన కట్టడాలను మున్సిపల్ సిబ్బంది పోలీస్ బందోబస్త్ నడుమ తొలగించారు. డ్రైనేజీలపై అక్రమ కట్టడాల వల్ల వర్షం పడినప్పుడు దిగువ ప్రాంతాలైన భగత్‌సింగ్ నగర్, శ్రీపతినగర్ ఇండ్లలోకి మురుగునీరు రావడంతో బస్తీ వాసులు అనారోగ్యాలకు గురవతున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. ఇదే సమస్యపై ఇరు కాలనీలకు చెందిన రాయబారపు కిరణ్, రవి కిరణ్, వెంకన్న, శేఖర్, సోమయ్య, గౌతం మున్సిపల్ కమిషనర్‌ను పిలిపించి సంబంధిత అధికారులకు 15 రోజులుగా తమ గోడుని చెప్పుకున్నారు. డ్రైనేజీల మీద కట్టడాలను కూల్చివేయడం భగత్‌సింగ్ నగర్, కమాన్ తర్వాత కల్వర్టు కిందికి ఉన్నట్లు తెలిపారు. కల్వర్ట్‌ని ఎత్తుగా నిర్మించాలని తద్వారా నీరు సులువుగా వెళ్లడం జరుగుతుందని కమిషనర్‌కి తెలిపారు. సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవడం పట్ల కమిషనర్ వెంకటేశ్వర్లను స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులను తప్పుదారి పట్టిస్తున్న కార్మిక సంఘాలు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికులను కొన్ని కార్మిక సంఘాలు తప్పుదారి పట్టిస్తున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా అన్నారు. శుక్రవారం ఎస్ఆర్పీ-3గని ఆవరణలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏడాది సంస్థకు వచ్చిన లాభాల నుంచి కంపెనీ విస్తరణ కోసం, ఓపెన్ కాస్ట్‌లలో బ్యాక్ ఫీలింగ్ కొరకు థర్మల్, హైడల్, సోలార్, పవర్ ప్లాంట్ల నిర్మాణానికి కొంత మొత్తాన్ని పెట్టుబడిగా తీసి మిగిలిన మొత్తం నుంచి కార్మికులకు 33శాతం లాభాల వాటా చెల్లించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి మురళీ చౌదరి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు మల్లేష్, అంబాల రవి, రోమోజీ, సారయ్య, గాజుల ప్రభాకర్ శ్రీకాంత్, విక్కీ, ఆడేపు సురేష్, ప్రనిల్, సురేష్, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

కలమడుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మంచిర్యాల ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం, (ఆర్‌బీఎస్‌కే) జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ గౌరీ శంకర్, ఆప్తమాలజీ టెక్నీషియన్ శంకర్ విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 221 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు మురిమడుగుల రమేష్, రాజేందర్, కవిత, సాగర్, నరసయ్య పాల్గొన్నారు.

ఎంఈఓగా వెంకటేశ్వర స్వామి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట



మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ఎంఈఓగా ముక్తవరపు వెంకటేశ్వర స్వామి బాధ్యతలను స్వీకరించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన వెంకటేశ్వర స్వామి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అందరి సహకారంతో ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీ చేస్తూ ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందే విధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తప్పకుండా సమయ పాలన పాటించాలని సూచించారు. ఎంఈఓ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి కన్నెపల్లి ఎంఈఓ సెడ్మాక రాము ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. అనంతరం కాసిపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం మామిడిపెల్లి సాంబమూర్తి, దేవాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాథోడ్ రమేష్, ధర్మరావుపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం సుధాకర్ నాయక్, ఎంఆర్సీ సిబ్బంది సీసీఓ రాంబాబు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సౌజన్య, సీఆర్పీ మడావి తిరుపతిలు నూతన ఎంఈవోకు శాలువాలతో సన్మానించి, పూల మొక్కని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శప్రాయుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ ప్రాంత అభివృద్ధికి అహర్నిషలు తపించిన ఆదర్శప్రాయుడు కొండా లక్ష్మణ్‌బాపూజీఅని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావాత్ మోతిలాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్‌లతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల చరిత్రను కాపాడుతూ వారి ఆశయాలను భావితరాలకు అందించాలని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత అని, మహనీయుల చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని భావితరాలకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలువేరు సదానందం, నాయకులు గుండేటి యోగేశ్వర్, చిలగాని సుదర్శన్, గడ్డం సుధాకర్, బండి మల్లికార్జున్, దోమల రమేష్, టీపీసీసీ జిల్లా అధ్యక్షుడు వేముల రమేష్, బీసీ సంఘాల నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని, బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నస్పూర్ పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలగాని బొడ్డయ్య, శ్రీ లక్ష్మి గణపతి శివ మార్కండేయ దుర్గాదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం రామన్న అన్నారు. తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు శుక్రవారం నస్పూర్ పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం వేముల సురేష్, కోశాధికారి చిప్ప రాజబాబు, మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చిలువేరు సదానందం, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్, బొడ్డున రామ్మూర్తి, చిలువేరు శరబంధం, కుందారపు రాములు, కుందారపు రమేష్, క్యాతం రాజేష్, యాదగిరి, సత్యనారాయణ, అనిల్ కుమార్, వీరన్న పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణు,ఆర్ఓ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. జీఎం కార్యాలయంలోకొండ లక్ష్మణ బాపూజీ జయంతి సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, పాల్గొన్నారు.

జన్నారం : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి దాస్య విముక్తి కల్పించిన నాయకులలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకరని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కెపి నరసింహులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కో కన్వీనర్ కడార్ల నరసయ్య, జిల్లా కోకన్వీనర్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అదేవిదంగా తహసీల్దార్ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

మందమర్రి : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, సీఎంఓఐ సెక్రటరీ పైడీశ్వర్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డిప్యూటీ పీఎం ఆసిఫ్, హెచ్ఓడీలు, జీఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపాలిటీ ఆవరణలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్యాంసుందర్, ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బంగారి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్లు రాజేందర్ పాల్గొన్నారు.

హాజీపూర్ : స్వతంత్ర్య సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి వేడుకలు మండంలలో ఘనంగా నిర్వహించారు. 13వ బెటాలియన్‌లో కమండెంట్ పీ.రాములు బాపూజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. మండల కేంద్రంలో శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు కుటుంబరావు, అంకం కృష్ణమూర్తి, వెంకటి, బింగి శ్రీకాంత్, శ్రీను, రంజిత్‌లు పాల్గొన్నారు. గుడిపేట్, హాజీపూర్, టీకనపల్లి, మల్కల్ల గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు.



మందమర్రి



హాజీపూర్

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-తాండూర్

పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు కుటుంబ పరిరక్షణ, విధులు, బాధ్యతలతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తాండూర్ ప్రభుత్వ వైద్యాధికారి ఝాన్సీ తెలిపారు. మండలంలోని పంచాయితీ కార్మికులకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయితీ మల్టీపర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు నిర్వహించేటప్పుడు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పారిశుధ్య పనులు నిర్వహించేటప్పుడు ముఖానికి మాస్కులు చేతులకు గ్లౌజులు ధరించాలని తెలిపారు. పనిలో మధ్య మధ్యన విరామం తీసుకోవాలన్నారు. ఆహార నియమాలు పాటిస్తూ పరిశుభ్రమైన నీటిని తాగాలని తెలిపారు. తీసుకునే ఆహారం, తాగే నీరు మనిషి ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయన్నారు. భోజనం చేసేటప్పుడు కాళ్లు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. జలుబు, ఆయాసం, తలనొప్పి జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రిని సంప్రదించాలన్నారు. తాండూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వసతి సౌకర్యాలు గల వైద్యం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ తాండూర్ ఏఎస్ఎం నవిత రేచిని ఏఎస్ఎం శ్రీలత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు

ప్రభుత్వ వైద్యాధికారి ఝాన్సీ శుక్రవారం తాండూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన పోషకాహారం లోపంతో ఎదుగుదలలేని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి, హెల్త్ సూపర్‌వైజర్ రమ అంగన్‌వాడీ టీచర్లు పావని, శారద, సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

- ఎంఈఓ ముక్తవరపు వెంకటేశ్వర స్వామి
- స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులకు శిక్షణ



నవతెలంగాణ-కాసిపేట

విద్యార్థులకు వారి సామర్థ్యాలకు అనుగుణంగా గుణాత్మక విద్య అందించాలని కాసిపేట ఎంఈఓ ముక్తవరపు వెంకటేశ్వర స్వామి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో కాసిపేట స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లో ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ ముక్తవరపు వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామర్థ్యాలను ఉపాధ్యాయుడు పరిశీలించి, వారికి అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రాథమిక విద్యా దశ చాలా ముఖ్యమైనదని, ప్రైమరీ స్థాయిలో విద్యార్థులకు విద్యా అంశాలపై అవగాహన వచ్చినట్లయితే హై స్కూల్ స్థాయిలో ఉన్నత చదువుకు దోహదపడుతుందని, ఈ దిశగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తప్పకుండా సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యా అంశాల్లో ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి ఎంఈఓ సెడ్మాకి రాము, కాసిపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం మామిడిపెల్లి సాంబమూర్తి, దేవాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాథోడ్ రమేష్, ధర్మరావుపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం సుధాకర్ నాయక్, ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

వృద్ధుల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ సబావాత్ మోతిలాల్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి నుంచి ముఖరం చౌరస్తా వరకు చేపట్టిన వాకథాన్ ర్యాలీని జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, వయోవృద్ధుల సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రేష్మ చందన, రెస్పాన్స్ ఆఫీసర్ ఎండీ ఫర్జానా బేగం, డీహెచ్‌ఈడబ్ల్యూ సమన్వయకర్త సౌజన్య పాల్గొన్నారు.

ఎల్లంపల్లికి భారీగా వరద నీరు

- 16 గేట్లు ఎత్తి నీటిని గోదావరికి వదులుతున్న అధికారులు



నవతెలంగాణ-హాజీపూర్

ఎగువన కురుస్తున్న వర్షాలకు, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఎస్ఆర్ ఎస్పీ నుండి 81 వేల క్యూసెక్కుల నీరు, వరద రూపంలో 74 వేల క్యూసెక్కుల వస్తుండడంతో మొత్తంగా లక్ష యాభై ఐదు వేల క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో రూపంలో వస్తుంది. ఇప్పటికే ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యంతో నిండి ఉంది. దీంతో అధికారులు 16 గేట్లు ఎత్తి ఒక అరవై వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు.

ఎస్టీ వర్గీకరణ చేయాలని తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-జన్నారం

ఎస్టీ వర్గీకరణ చేయాలని రాజ్‌గోండ్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజ్ గోండు మండల అధ్యక్షుడు ఆడ హనుమంతరావు మాట్లాడుతూ ఎస్టీలో ఆదిమ జాతి గిరిజనుల అభివృద్ధి చెందడం లేదన్నారు. గోండు నాయకపోడు, కొల్లం, పరదాన్ తోటి మన్నె ఇతర గిరిజన జాతుల అభివృద్ధి చెందాలంటే ఎస్టీ రిజర్వేషన్ తప్పకుండా ఉండాలన్నారు. రాజ్ గోండు సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ, ఎంపీఓలో ఆకస్మిక బదిలీ

నవతెలంగాణ-హాజీపూర్

మండల ఎంపీడీఓ మధుసూదన్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి లు ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఎంపీడీఓ భీమారంకు బదిలీ కాగా దండేపల్లి ఎంపీడీఓ ప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఎంపీఓ వేమనపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరు ఛార్జ్ తీసుకోలేదు.

పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-వేమనపల్లి

పీడీఎస్‌యూ 50 వసంతల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ వాల్ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల విప్లవ ప్రస్థానంలో అనేకమంది విద్యార్థి రత్నాలు పిడికిలి బిగించి జెండా కోసం తమ ప్రాణాలు త్యాగం చేశారని కామ్రేడ్ జార్జిరెడ్డి మతోన్మాద కత్తిపోట్లకి ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నేల కొరిగాడని కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్, శ్రీపాద శ్రీహరి నాటి ఎమర్జెన్సీ చీకట్లో నాటి నియంతృత్వ పాలకుల తుపాకి తూటాలకు తమ ప్రాణాలని అర్పించారని కోలా శంకర్, చేరాలు రంగవల్లి స్నేహలత మారోజు వీరన్న, మధుసూదన్, రాజు యాదవ్, యానాల వీరారెడ్డి, రమణయ్య, సాంబన్న లాంటి ఎందరో వీరులు తమ విలువైన ప్రాణాలని ప్రగతిశీల విద్యార్థి ఉద్యమానికి ఇచ్చి సంస్థని సమున్నతంగా నిలబెట్టారని అన్నారు. ఏ విద్యార్థి సంఘంకి లేని త్యాగాల చరిత్ర పీడీఎస్‌యూ సంస్థకి ఉన్నదని అన్నారు. ధ్వసం అవుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యా కార్పొరేటీకరణకి వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్నీ రద్దు కోసం పీడీస్‌యూ అనునిత్యం పోరాటాలు నిర్వహిస్తోందని అన్నారు. పోరాట స్ఫూర్తిని వివరిస్తూ అమరవీరుల ఆశయాలని ఎత్తిపడుతూ సంస్థ ఆవిర్భవించి 50 ఏండ్లు అయిన సందర్భంగా పూర్వ, ప్రస్తుత పీడీఎస్‌యూ నాయకులు విద్యార్థి, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సాయి కుమార్, అజయ్, వంశి, రాజు, స్వరూప పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ క్షేత్ర స్థాయిలో వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట పిలక దశ నుండి చిరు పొట్ట దశలో ఉందని, ప్రస్తుతం వరి పంటలో ఆకు ముడత పురుగు, కాండం తొలిచే పురుగు, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, జింక్ లోపం ఉందని, వరిలో ఆకు ముడత పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-జైపూర్



తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మిట్టపల్లిలో ఆర్థిక అక్షరాస్యత సదస్సును శుక్రవారం నిర్వహించారు. నాబార్డ్ వారి సౌజన్యంతో శుక్రవారం మిట్టపల్లి గ్రామస్థులకు బ్యాంకు ద్వార అమలు చేస్తున్న పథకాలపై అవగాహణ కల్పించారు. ఖాతాదారుల సౌలభ్యం కోసం బ్యాంకు అమలు చేస్తున్న పథకాలతో పాటు రుణ సదూపాయం, భీమా సౌకర్యం తదితర అంశాలను ఎంవీ రూరల్ ఫోక్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం సభ్యులు ఆటపాటల ద్వార వివరించారు. అదేవిధంగా మ్యాజిక్ షో ద్వార పలు అంశాలను చక్కగా వివరించారు. ఈ కార్యమంలో జైపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సుధీర్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ హేమ సుందర్, బ్యాంక్ సిబ్బంది, గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు..

13వ బెటాలియన్‌లో అడిషనల్ డీజీపీ పర్యటన



నవతెలంగాణ-హాజీపూర్

గుడిపేట్ 13 వ బెటాలియన్ లో శుక్రవారం బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ పర్యటించారు. బెటాలియన్ లో నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్‌తో పాటు,మోటార్ వెహికల్ సెక్షన్, పలు విభాగాలను సందర్శించి పలు సూచనలు చేశారు. శిక్షణ కానిస్టేబుళ్లతో మాట్లాడారు.మొక్కలు నాటారు. బెటాలియన్ కు వచ్చిన అడిషనల్ డీజీపీనీ రామగుండం సీ పీ శ్రీనివాస్,మంచిర్యాల డీసీపీ భాస్కర్,సీఎస్పీ ఏ సీ పీ రాఘవేంద్ర రావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ లు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ వెంకట రాములు, నాగేశ్వర్ రావు, కాళిదాసు పాల్గొన్నారు.

జీపీ కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

- ఎంపీడీఓ సత్యనారాయణ

నవతెలంగాణ-జైపూర్



గ్రామ పంచాయతీల పరిధిలో నిరంతరంగా పారిశుధ్య పనుల్లో పాల్గొంటున్న పంచాయతీ కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపు రావు అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కుందారం ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్మికులను స్థానిక వైద్యాధికారి ముస్తాఫా, శ్రావ్య వైద్య పరిక్షలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ద్వారం బీపీ, షుగర్‌తో పాటు ఇతర వైద్య పరిక్షలు నిర్వహించిన వైద్యులు ఆరోగ్యం పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్మికులు ఆయుష్మాన్ భారత్ కార్డులు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్మికులకు రూ. 10 లక్షల విలువ గల వ్యక్తిగత భీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పద్మశాలి సంఘం నాయకులు పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, పద్మశాలి సంఘం మండల గౌరవ అధ్యక్షుడు నడిమెట్ల రాజన్న, మండల అధ్యక్షుడు వేముల రాజగురువయ్య, ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రాయలింగు, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, రజక సంఘం మాజీ మండల అధ్యక్షుడు మందపెల్లి తిరుపతి, పద్మశాలి సంఘం నాయకులు బోప్పు కిషన్, శంకర్, లచ్చన్న, రవి, మల్లేష్, చందు, మధు పాల్గొన్నారు.

కాసిపేట్ ఎంపీడీఓ కార్యాలయంలో

మండల పరిషత్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్ఞ ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, సూపరింటెండెంట్ అల్లూరి లక్ష్మణ్, సీనియర్ ఆసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మన్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ శ్వేతారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడబ్ల్యూ వర్కర్స్‌కు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఎంపీడబ్ల్యూ వర్కరర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ సఫ్దర్ అలీ, వైద్యురాలు దివ్య, పంచాయతీ కార్యదర్శులు మేఘన, శ్రీధర్, ఉదయ్, ఎంపీడబ్ల్యూ వర్కర్స్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సత్యశోధక్ సమాజ్ దినోత్సవం



నవతెలంగాణ-జన్నారం

సత్యశోధకు సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో కుల వ్యవస్థ నిర్మూలపై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. సత్యశోధక్ సమాజ్ 152వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం మాట్లాడుతూ 1872వ సంవత్సరంలో సావిత్రిబాయి పూలే-జ్యోతిబాపూలే సత్యశోధక్ సమాజ్ స్థాపించారని తెలిపారు. సమాజంలో అసమాన తలను రూపుమాపడానికి సత్యశోధకు సమాజ్‌ని నెలకొల్పారని తెలిపారు. ప్రజలందరూ సమానత్వం కోసం పోరాడాలని తెలిపారు. విద్యార్థులు ఐక్యమత్యంగా ఉండాలని తెలిపారు. భారతదేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే-జ్యోతిబాపూలే కాబట్టి ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కుల వివక్ష, కుల నిర్మూలనకు వ్యతిరేకంగా ప్రజలు విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తరగతులకు హాజరు కావాలి



నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థులు ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని మండల కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలీస్ మాధుర్య అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మద్దుల సునితతో కలిసి శుక్రవారం పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పరంగా ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలకు సంబంధించిన 2వ విడతగా 257 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా శనివారం అటల్ లింకర్ ల్యాబ్ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

కళాశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ శంకర్ అధ్యక్షతన టెలీ మానస్ కార్యక్రమంలో భాగంగా మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ కుమార్ విద్యర్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే విద్యార్థులు మంచి లక్ష్యాలను, ఏర్పరచుకొని వాటిని సాధించడానికి ప్రతినిత్యం లక్ష్యాలను చేరుకోవడానికి వాటికి సంబంధించిన పుస్తకాలను సేకరించుకొని సమయాన్ని సద్వినియోగ చేసుకోవాలన్నారు. విద్యార్థి ప్రవర్తనలో మార్పు, ఆలోచన విధానంలో మార్పు రావాలని, ఇప్పుడే మంచి కళలను అభిరుచులను, లక్ష్యాలను ఏర్పరచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

- ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-మంచిర్యాల



ఉమ్మడి కరీంనగర్ నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న పట్టభద్రులు వారి ఓటు నమోదు చేసుకోవాలని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజక వర్గాల బరిలో నిలువ నున్నట్లు పేర్కొన్నారు. పట్ట భద్రుల భవిష్యత్‌కు భరోస తనది అని, వారి సమస్యల పరిష్కారానికీ కృషి చేస్తా నన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు. పట్ట బద్రులు కొందరు అర్హత ఉన్న ఓటు హక్కును వినియోగించు కోవడం లేదని, గత ఎన్నికల్లో 1.97 లక్షల ఓటర్లు ఉంటే దాదాపు లక్ష మంది వరకు ఓటు వెయ్యలేదన్నారు. ఈ నెల 30 నుండి నవంబర్ 6 తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందని జిల్లాలో కార్యాలయం ఏర్పాటు చేసి దరఖాస్తులు చేయిస్తామని తెలిపారు. సేవ చేసేందుకు బరిలో నిలుస్తున్నాను అని, పార్టీ నుండి టిక్కెట్ రాని పక్షాన ఇండిపెండెంట్ అభ్యర్థిగా అయినా భరీలో నిలుస్తానని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు.

చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-తాండూర్

నాలుగు లేబర్‌కోడ్‌లు, మూడు నేర చట్టాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న ఛలో హైదరాబాద్ ధర్నాను విజయవంతం చేయాలని శుక్రవారం మదారం టౌన్ షిప్‌లో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎస్‌సీసీ డబ్ల్యూ యు-ఐఎఫ్‌టీయూ)ఆధ్వర్యంలో మాదారం టౌన్ షిప్‌లో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులు సంవత్సరాల కొద్ది కనీస వేతనాలు లేక, పని స్థలాలలో సౌకర్యాలు లేక, వెట్టి చాకిరీ చేస్తూ శ్రమ దోపిడికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శకుంతల, మల్లేశ్వరి, ఓదెమ్మ లక్ష్మి చంద్రమ్మ, లక్ష్మి, నాందేవ్, రాజు, బుచ్చన్న, సురేష్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం..నిండు ప్రాణం బలి

నవతెలంగాణ-హజీపూర్

లారీ డ్రైవర్ నిర్లక్షం కారణంగా రోడ్డు ప్రమాదంలో ఒక నిండు ప్రాణం బలిగొంది. మృతుని భార్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కారణమామిడి గ్రామానికి చెందిన వడ్డేపల్లి తిరుపతి తన బైక్‌పై గురువారం రాత్రి మంచిర్యాల నుండి కర్ణమామిడి గ్రామానికి వస్తున్నాడు. ఇదే క్రమంలో గుడిపేట శివారులో కపిల్ వెంచర్ సమీపంలో జాతీయ రహదారికిపై లారీ ఎలాంటి సూచికలు లేకుండా నిలిపి వుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాల లైట్లకు ఆగిన లారీ కనపడక తిరుపతి లారీని వెనుకనుండి ఢీకొన్నాడు. 108 వాహనం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య స్నేహలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటిలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. మంచిర్యాల జిల్లా సైన్స్ సెంటర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలో గ్లోబల్ వాటర్ క్రైసిస్ అనే సబ్ థీమ్ అంశంపై విద్యార్థులు నాటకాన్ని ప్రదర్శించారు. కర్నాటక కోలార్ జిల్లాకు చెందిన ఎస్ ఆషా నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ కథను రూపొందించినట్లు, నీటి సంరక్షణ కోసం ఆమె కోలార్ జిల్లా ప్రజలను ఎలా చైతన్యవంతం చేసింది అనే కథాంశాన్ని తెలిపారు. ఈ నాటకాన్ని 8వ తరగతి విద్యార్థులు జూపాక అక్షయ, దేవసాని మనస్విని, షేక్ ముఫీజా, ఎర్రోజు చైత్ర, నడిగొట్టు హాసిని, రత్నం లావణ్య, శ్రీరాముల లిప్సిక, బిజినూరి షారన్, అట్ల అభివర్థిని పాల్గొన్నారు. ఈ నాటకానికి సైన్స్ టీచర్ జాడి ప్రవీణ్ నేతృత్వం వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ విద్యార్థులను, గైడ్ టీచర్ను అభినందించారు.

అప్రమత్తతతోనే హెచ్‌ఐవి, ఎయిడ్స్ నివారణ

నవతెలంగాణ-జన్నారం

అప్రమత్తతతోనే హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణ సాధ్యమవుతుందని కళాజాత బృందం సభ్యులు అన్నారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం జన్నారం పట్టణంలోని బస్టాండు, ఇందన్‌పల్లి గ్రామంలోని జడ్పీ పాఠశాలలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్‌కు మందు లేదని, చైతన్యంతో అప్రమత్తంగా ఉంటే నివారించడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎండీఓ సంతోష్ స్నేహ ఎన్జీఓ ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు వైఆర్‌జీకేలింక్ వర్కర్స్ సుధారాణి, స్వప్న, విజయ పాల్గొన్నారు

జీవిత భాగస్వామి ఆరోగ్యంగా ఉంటేనే ఉత్సాహం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీలో పని చేస్తున్న సిబ్బంది జీవిత భాగస్వామి ఆరోగ్యంగా ఉంటేనే వారు ఉత్సాహంగా పని చేస్తారని భావించిన ఆర్టీసీ ఎండీ ఆరోగ్య పరీక్షలను నిర్వహించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో డిస్పెన్సరీలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ స్పాజ్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది జీవిత భాగస్వామికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ సిబ్బంది కుటుంబ సభ్యులు బాగుంటేనే వారు కూడా బాగుంటారన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన సంస్థ ఎండీ ఆరోగ్య పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టారన్నారు. రెండు సంవత్సరాల క్రితమే సిబ్బందికి ఆరోగ్య పరీక్షల కార్యక్రమం ప్రారంభమైందన్నారు. మూడవ సారి వారి ఇంటివారికి కూడా చేయిస్తున్నామన్నారు. ఇంట్లో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా ఉంటే సిబ్బంది ఉత్సాహంగా పని చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఎం కల్పన, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోజువారీగా పౌష్టికాహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత



నవతెలంగాణ-జైపూర్

తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉండటానికి గర్భిణులు రోజు వారిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ టేకుమట్ల సెక్టర్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. పోషన్‌మాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుందారం గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో సమావేశమయ్యారు. ఈ సంధర్భంగా సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం సధ్యారాణి, హెల్త్ సూపర్‌వైజర్ సత్తయ్య, స్థానిక అంగన్‌వాడీ టీచర్ పద్మావతి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

'యువత భవిష్యత్తును పాడు చేసుకోవద్దు'

నవతెలంగాణ-నస్పూర్

గంజాయి మత్తులో పడి యువత బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ అన్నారు. శుక్రవారం నస్పూర్ పట్టణంలో ఆక్స్‌ఫర్డ్ హై స్కూల్ విద్యార్థులచే డ్రగ్స్‌కి వ్యతిరేకంగా అవగాహన ర్యాలిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి సేవించడం వలన అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. యువత గంజాయి సేవించడం వల్ల మానసిక పరమైన సమస్యలు వస్తాయని, గంజాయి సేవించి వలన తమ బంగారు భవిష్యత్‌ను పడు చేసుకుంటున్నారన్నారు. గంజాయి అమ్మడం, కొనడం నేరమని, గంజాయి అమ్మడం ఎవరికైనా తెలిస్తే సమాచారం అందించాలని, అమ్మిన వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాధికారిగా మల్లేశం



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ ఎంఈఓగా మల్లేశం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తాండూర్ మండలంలోని రేచీని తంగళ్ళపల్లి హైస్కూల్లో హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహించిన మల్లేశం ఎంఈఓగా పదోన్నతి పొందారు. తాండూర్ మండలంలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో గురుకులాల్లో విద్యాభివృద్ధికి కషి చేస్తానని మల్లేశం తెలిపారు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓను మండలంలోని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రేమలత, శ్రీరాములు, జయప్రద, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైన్స్ కళాశాలలో పర్యాటక దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత మాట్లాడారు. విద్యార్థులు టూరిజం రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లాలోని టూరిస్ట్ కేంద్రాల గురించి ప్రచారం చేయాల్సిన బాధ్యత టూరిజం క్లబ్ సభ్యులపై ఉందన్నారు. వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ విజేతలు మలీహ మహీన్, అలియా గౌహర్, ఆకుల శిరీష, సదఫ్‌కు బహుమతులు అందించారు. విద్యార్థుల పెయింటింగ్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో యువ టూరిజం క్లబ్ సమన్వయకర్త డాక్టర్ పత్తివార్ శ్రీనివాస్, సభ్యులు రడాపు సంతోష్ కుమార్, డిఎస్. చక్రవర్తి, అధ్యాపకులు జగ్రామ్ అంతర్వేది, డా.అరుణ్ కుమార్, అష్రఫ్ అలీ, రమాకాంత్‌గౌడ్, రాజ్‌కుమార్, జ్ఞానేశ్వర్, అఫ్రీన్, ఆనందం, దుర్గాశేఖర్, రాధ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వయోవృద్ధుల వాక్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీనియర్ సిటిజన్ వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన వయోవృద్ధుల వాక్ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో వయోవృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే మాట్లాడుతూ ప్రస్తుత ఒత్తిడి సమాజంలో నడక ఎంతో అవసరమన్నారు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాలైన వాకింగ్ చేయాలని సూచించారు. దీని కారణంగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ స్వామి, సమాఖ్య సభ్యులు గుండయ్య, రాం కులకర్ణి, లింగయ్య, అప్సర్ ఖాన్, దేవన్న పాల్గొన్నారు.

డబ్బా క్లస్టర్ రైతు వేదిక అటెండర్ ఆందోళన

నవతెలంగాణ-చింతలమానేపల్లి

డబ్బా క్లస్టర్ రైతు వేదిక భవనంలో గత మూడు సంవత్సరాలుగా అటెండర్‌గా పనిచేస్తున్న నక్క గజానన్, శుక్రవారం రైతు వేదిక భవనం ముందు బైఠాయించి ఆందోళన చేశాడు. తకు రావాల్సిన కనీస వేతనం గత మూడ సంవత్సరాల నుంచి ఇప్పటివరకు ఏ ఒక్క రూపాయి కూడా అందలేదని ఆవేదనకు గురయ్యాడు. అధికారు లు కనీస వేతనం ఇవ్వనట్లయితే నేను ఎలా జీవించాలి నా భార్య పిల్లలను ఏ విధంగా పోషించాలని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని అన్నాడు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని బారెగూడ గ్రామంలో శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డిఈ నాగరాజు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ మోటార్లకు రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. కెపాసిటర్లు ఏర్పాటుతో ఓల్టేజ్ సమస్య తీరడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడకుండా, చెడిపోకుండా ఉంటాయని అన్నారు. అంతేకాకుండా విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు తరచూ జరుగుతున్న నేపథ్యంలో అధికారులు అందించే సలహాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌటాల ఏడిఈ రాజేశ్వర్, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక తెలంగాణ కోసం పరితపించిన కొండా లక్ష్మణ్ బాపూజీ

నవతెలంగాణ-జైనూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముద్దుబిడ్డ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ప్రత్యేక తెలంగాణ కోసం పరితపించిన వ్యక్తి అని స్థానిక తహసీల్దార్ వనజా రెడ్డి అన్నారు.. మూడు తరాల ఉద్యమాలకు ముద్దుబిడ్డ కొండ లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు.. స్వాతంత్ర సమరయోధుడు, ప్రత్యేక తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఉమ్మడి జిల్లా లో జన్మించడం గర్వకారణం అని పేర్కొన్నారు.. 9 పదుల వయస్సు దాటిన ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షకు ఎప్పటికప్పుడు పదులు పెట్టిన పోరాట యోధుడని తెలిపారు.. ఈ సందర్భంగా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

మెడికల్ కళాశాలకు సిబ్బందిని నియమించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలకు సిబ్బందితోపాటు వైద్యులను నియమించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్ర వైద్య శాఖ సెక్రెటరీ క్రిస్టియానా చోంగ్తుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు సిబ్బందితో పాటు వైద్యుల నియమించాలన్నారు. వైద్య కళాశాలలో 114 మంది ఉండాల్సింది కేవలం 7 మంది మాత్రమే ఉన్నారని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని సామాజిక ఆస్పత్రికి శాశ్వత సూపరింటెండెంట్ లేకపోవడంతో పాలన కొరవడిందని, శాశ్వత ప్రాతిపదికన సూపరింటెండెంట్లను నియమించాలని కోరారు. అనేకమంది గర్భిణులు అనీమియాతో బాధపడుతున్నారని వారికి పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. శానిటేషన్ సిబ్బంది ఆరు నెలల నుండి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వారికి ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించాలన్నారు.

శుద్ధ జలం ప్రమాణాలను పరిశీలించాలి



నవతెలంగాణ-కౌటాల

గ్రామాలలో శుద్ధ జలం ప్రమాణాలను గ్రామ స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు నీటి ప్రమాణాలను పరిశీలించాలని మిషన్ భగీరథ డీఈఈ పృథ్వీరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ భగీరథ గ్రామ సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పనిచేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది ఎప్పటికప్పుడు మిషన్ భగీరథ నీటి ప్రమాణాలను పరిశీలించి ఎలాంటి అనుమానాలు వచ్చిన వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని గ్రామాలలో గ్రామస్తులకు శుద్ధ జలం అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోట ప్రసాద్, ఏఈఈ మృదయ వీర్ పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తేవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి అన్నారు. శనివారం నుంచి ఝార్ఖండ్‌లో నిర్వహిస్తున్న 34వ సబ్ జూనియర్ జాతీయస్థాయి ఖోఖో ఛాంపియన్షిప్‌కు బయలుదేరుతున్న గిరిజన క్రీడ పాఠశాల విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో చదువుతున్న నలుగురు గిరిజన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు ఈ నెల 18 నుంచి 25 వరకు కల్లూరు లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో ప్రతిభ కనబరిచి తెలంగాణ జట్టుకు ఎంపికయ్యారని అన్నారు. విద్యార్థులు జాతీయస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి బండమీనారెడ్డి, జీసీడీఓ శకుంతల, ఏసీఎంఓ ఉద్దవ్, ఏటీడీఓ చిరంజీవి, శిక్షకులు తిరుమల్, ఎంపికైన విద్యార్థులు నాగేశ్వరి, వైష్ణవి, సరోజ, శ్రీలత పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేసి వారి సంక్షేమానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాలలో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, వారి సంక్షేమ, సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. వయోవృద్ధుల పోషణ, సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిడిపిఒలు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-కౌటాల

విద్యార్థులు చదువుతోపాటు ఆయా రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి గావుడే హనుమంతు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళా మహోత్సవ కార్యక్రమం నిర్వహించగా విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. వారిలో దాగున్న కలలను బయటికి తీశారు. విద్యార్థులలో దాగిఉన్న కళలను బయటకి తీసుకురావాలంటే ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతి సాధించగా వారిని మండల విద్యాధికారి అభినందించారు. అదేవిధంగా వారిని జిల్లా స్థాయి కళ మహోత్సవానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణ సింగ్, న్యాయనిర్ణేతలు శ్యామ్‌రావు, భువనేశ్వరి, కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్ఓ పవిత్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-ముథోల్

పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పశుపతి శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పోషన్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గర్భిణులు మంచి పోషకాలు కలిగిన, ఆహారం తీసుకున్నప్పుడే, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పౌష్టిక ఆహార పదార్థాల ప్రదర్శనను పరిశీలించి రుచులు చూశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, సీడీపీఓ సరోజిని, ఎంపీడీఓ శివకుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు నర్సాగౌడ్, రోళ్ల రమేష్, తాటివార్ రమేష్, దశరథ్, దేవోజి భూమేష్, సతీష్ రెడ్డి, పోతన్న, సంతోష్, శ్రీనివాస్, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

ఖానాపూర్ టౌన్ : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సత్తన్‌పెల్లి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం పోషన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలోని ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, కడెం మండలాల అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నం సత్యం, హమానుల్లా ఖాన్, తోట సత్యం, శంకర్, సంతోష్, షబ్బీర్ పాషా, సీడీపీఓ సరిత, ఖానాపూర్, పెంబి ఎంపీడీఓలు సునీత, రమాకాంత్ పాల్గొన్నారు.

విహారయాత్రకు బయలుదేరిన విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, ఉపన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులు కుంటాల జలపాతం విహారయాత్రకు శుక్రవారం బయలుదేరారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. పర్యాటక శాఖ అధికారి రవికుమార్, డీఈఓ ప్రణీత, ఏఎస్ఓ శ్రీహరి బాబు ఉన్నారు.

వీఆర్ఏలకు నియామక పత్రాలు జారీ చేయాలి

నవతెలంగాణ-ముథోల్

61ఏండ్లు పైబడిన వీఆర్ఎల వారసులుగా తమకు వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వ జీవో 81,85, ప్రకారం రాష్ట్రంలో 3797 మందిని వీఆర్ఎల వారసులుగా అర్హులని గుర్తించిందన్నారు. జీవోలపై స్టే ఉన్న కారణంగా నియామక పత్రాలను ఇప్పటి వరకు అందజేయలేదన్నారు. 21నవంబర్ 2023లో హైకోర్టు డివిజన్ బెంచ్ జీవో 81పై స్టేను తొలగించిందన్నారు. అప్పటి నుండి తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా తమను గుర్తించి నియామక పత్రాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ముత్యం, దశరథ్, పోతన్న, నవీన్, భూమన్న పాల్గొన్నారు.

రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలి

నవతెలంగాణ-తాంసి

రుణమాఫీ పూర్తి స్థాయిలో చేసి వెంటనే రైతు భరోసా ఇవ్వాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ పంట ముగుస్తున్న రైతులకు రైతు భరోసా నిధులు అందలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ డిక్లరేషన్‌లో ప్రతి రైతుకు రూ.2లక్షల రుణం మాఫీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ పూర్తి స్థాయిలో మాఫీ కాక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే అర్హులైన ప్రతి రైతు రుణం మాఫీ చేయడంతో పాటు వెంటనే రైతు భరోసా నిధులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సతీష్‌రెడ్డి, అశోక్, సంతోష్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, సురేందర్, చిన్న రాంరెడ్డి పాల్గొన్నారు.

రైతులు బయో ఫర్టిలైజర్‌పై దృష్టి సారించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రైతులు రసాయనిక ఎరువులకు స్వస్తి పలికి బయో ఫర్టిలైజర్‌పై దృష్టి సారించాలని ఐకార్ కేంద్రీయ మెట్ట ప్రాంతం వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కేస్లాపూర్ రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఏ వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రసాయనిక ఎరువులను వాడటం వల్ల దిగుబడి తగ్గి భూసారం తగ్గి పోతుందన్నారు. దాని నివారణకు రైతులు బయో ఫర్టిలైజర్స్‌ను వాడాలని సూచించారు. ప్రస్తుతం కూలీల కొరత నివారణకు కొత్త టెక్నాలజీతో డ్రోన్ ద్వారా పురుగుల మందును స్ప్రే చేయాలని తెలిపారు. ఐకార్ కింద జిల్లాలోని ఇచ్చోడ, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్ తదితర మండలాలను దత్తత తీసుకున్నామన్నారు. ప్రతి ఒక్కరు కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకుని నాణ్యమైన కూరగాయలను పండించాలన్నారు. కిసాన్ మేళాలో క్రీడ డైరెక్టర్ వికె సింగ్, అగ్రికల్చర్ డీన్ శ్రీధర్ చవాన్, మోహన్ పాల్గొన్నారు.

బిజినెస్

ఈ ఏడాది 7శాతంలోపు వృద్ధి

సీఈఏ నాగేశ్వర్ అంచనా



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి రేటు 6.5-7 శాతం మధ్య చోటు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి అనంత నాగేశ్వరన్ అన్నారు. శుక్రవారం ఆయన బెంగాల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బీసీసీఐ) నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులను బట్టి పరిశీలిస్తే ఇది మెరుగైన వృద్ధి రేటేనని తెలిపారు. కరోనా అనంతరం ప్రపంచ వాణిజ్యం మందగించడంతో మధ్యకాలిక అనిశ్చితులను ఎదుర్కొంటుండగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ద్రవ్య విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థ స్థిరపడిందన్నారు. దేశీయ ఆర్థిక మార్కెట్లు, బ్యాంకింగ్ వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నందున దేశ కరెంట్ ఖాతా బ్యాలెన్స్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. వ్యవసాయేతర ఉద్యోగాల కల్పనకు ఎంఎస్ఎంఈ రంగం కీలకమన్నారు. చిన్న, మధ్యతరహా సంస్థలు మరింత శ్రమశక్తిని పొందేందుకు పెద్ద పరిశ్రమల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

భారత్‌లోకి కొత్త రోల్స్ రాయిస్ కారు

ధర రూ.10.50 కోట్లు



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కార్లను తయారు చేసే రోల్స్ రాయిస్ కొత్తగా భారత మార్కెట్లోకి తన 'కల్లినన్ ఫేస్‌లిఫ్ట్'ను విడుదల చేసింది. ఇంతక్రితం మోడళ్లతో పోల్చితే ఇందులో అత్యాధునిక ఫీచర్లను పొందుపర్చినట్లు ఆ కంపెనీ తెలిపింది. కాగా దీని ప్రారంభ వేరియంట్ స్టాండర్డ్ వర్షన్ ఎక్స్ షోరూం ధరను రూ.10.50 కోట్లుగా, బ్లాక్ బ్యాడ్జ్ ధరను రూ.12.25 కోట్లుగా నిర్ణయించింది. వచ్చే డిసెంబర్ నుంచి వీటి డెలివరీలను ప్రారంభించే అవకాశం ఉందని ఆ సంస్థ పేర్కొంది.

సెప్టెంబర్ 30న సుదర్శన్ ఫార్మా బోర్డు భేటీ

హైదరాబాద్ : కెమికల్, ఫార్మాస్యూటికల్ కంపెనీ సుదర్శన్ ఫార్మా ఇండస్ట్రీస్ లిమిటెడ్ బోర్డు సెప్టెంబర్ 30న భేటీ కానుంది. ఇందులో కంపెనీ ఈక్విటీ షేర్ల సబ్-డివిజన్, విభజన ప్రతిపాదనను పరిశీలించే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. ఇటీవల ఈ కంపెనీ సుదర్శన్ మావెన్ ఫార్మా ప్రయివేటు లిమిటెడ్ పేరుతో కొత్త అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. దీని ద్వారా అన్ని రకాల ఔషధాలు, ఆరోగ్య సంరక్షణ, ఆయుర్వేద, ఆహార సప్లిమెంట్ ఉత్పత్తులను తయారు చేయడం, రూపొందించడం, ప్రాసెస్ చేయడంతో పాటు అభివృద్ధి, ఎగుమతులు, దిగుమతులు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

స్టాక్స్ విభజనపై పీసీ జ్యువెలర్స్ దృష్టి!

హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ పీసీ జ్యువెలర్స్ స్టాక్స్‌ను విభజించే యోచన చేస్తోందని సమాచారం. సెప్టెంబర్ 30న జరగనున్న కంపెనీ బోర్డు భేటీలో ఈ నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. ప్రస్తుతం రూ.10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్లను జారీ చేసింది. పలు బ్యాంకులకు చెల్లించాల్సిన రుణ బకాయిలను ఇటీవల వన్ టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించుకుంది. కంపెనీ తన వినియోగదారులు, విత్త సంస్థల నుంచి విశ్వాసాన్ని పొందాలని నిర్దేశించుకున్నట్టు పేర్కొంది.

వ్యవసాయ సలహాల కోసం హెల్ప్‌లైన్

గోద్రేజ్ ఆగ్రోవేట్

న్యూఢిల్లీ : ఆహార, వ్యవసాయ వ్యాపార సంస్థల్లో ఒక్కటైన గోద్రేజ్ ఆగ్రోవెట్ కొత్తగా పంటల రక్షణకు సంబంధించిన సలహాలను అందించనున్నట్టు తెలిపింది. ఇందుకోసం హలో గోద్రేజ్ పేరుతో బహుభాషల్లో నిపుణులతో సూచనలు ఇవ్వనున్నట్టు పేర్కొంది. దేశ వ్యాప్తంగా తెలుగు సహా ఎనిమిది భాషల్లో హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటుందని తెలిపింది.

తమ STORM సీరీస్ యొక్క ప్రత్యేక ఎడిషన్స్ ను విడుదల చేసిన జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా

నవతెలంగాణ-హైదరాబాద్: ఎంజి హెక్టర్ ప్రత్యేకమైన ఎడిషన్ SNOWSTORM విడుదల గురించి జెఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా ఈరోజు ప్రకటించింది. ఇది భారతదేశపు మొదటి ఇంటర్నెట్ ఎస్ యువి మరియు అస్టర్ యొక్క 'BLACKSTORM 2024 పరిమితమైన ఎడిషన్' - ఇది తన శ్రేణిలో భారతదేశపు అత్యంత ఆధునికమైన ఎస్ యువి. ద హెక్టర్ SNOWSTORM ఎస్ యువి ఆకర్షణీయమైన, దృఢమైన లక్షణం కలిగిన టెక్-సమృద్ధియైన వాహనం కోరుకునే ఔత్సాహికుల కోసం పరిపూర్ణమైన ఎంపికగా మారింది. ప్రీమియం ఇంటీరియర్స్ తో అస్టర్ BLACKSTORM యొక్క బ్లాక్-థీమ్డ్ ఎక్స్ రియర్ బోల్డ్, ఆధునికమైన, స్టైలిష్ ఎస్ యువి కోసం అన్వేషించే కస్టమర్లకు ఆకర్షణీయమైన ఎంపికను అందిస్తోంది. 5.6, మరియు 7-సీటర్ ఆకృతులలో లభించే, ఎంజి హెక్టర్ SNOWSTORM శ్రేణి రూ. 21,52,800/- లక్షలకు (ఎక్స్-షోరూం) ప్రారంభమవుతుంది మరియు అస్టర్ BLACKSTORM 2024 పరిమితమైన ఎడిషన్ రూ. 13,44,800/- లక్షలకు (ఎక్స్-షోరూం)లభిస్తోంది.

ఆర్.ఆర్.ఆర్ సెట్‌లో నిజంగానే జూనియర్ ఎన్టీఆర్ అసలైన చిరుతలతో పని చేశారా?

నవతెలంగాణ-హైదరాబాద్: నెట్‌ఫ్లిక్స్ యొక్క ది గ్రేట్ ఇండియన్ కపిల్ షోలో, మేము 'దేవర' యొక్క ముఖ్య తారాగణం - జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ మరియు సైఫ్ అలీ ఖాన్ తో కలిసి రాబోతున్నాము. లెజెండరీ మ్యాన్ ఆఫ్ ది మాసెస్, జూనియర్ ఎన్టీఆర్ ఈ బృందం లో ఉండటంతో, మెగాహిట్ ఆర్.ఆర్.ఆర్ లో పనిచేసిన అనుభవంపై ప్రశ్నలు ఎన్నో సహజంగానే తలెత్తుతాయి. సినిమాలో వివిధ రకాల జంతువులతో పాటుగా తన ఉద్విగ్నభరితమైన ప్రవేశ సన్నివేశాన్ని చిత్రీకరించడం ఎలా ఉందని కపిల్ అడిగినప్పుడు, జూనియర్ ఎన్టీఆర్ ఇదే సన్నివేశం గురించి, తన అభిమానులలో వున్న ఈ హాస్యాస్పదమైన సందేహాలను గురించి చెబుతూ ఎంతోమంది ఈ ప్రశ్నను తనను అడిగారన్నారు.

నిజానికి నేను, జంతువులతో పాటు కూర్చుని వున్నానని ? అనుకుంటుంటారు. జనాలు నన్ను అడుగుతుంటారు , మీరు ఎలా కూర్చున్నారని ? అప్పుడు నేను , యార్ , అది అంతా విఎఫ్ఎక్స్ మహిమ అని చెప్పేవాడిని. అయినా సరే , వారనే వాళ్ళు , అది విఎఫ్ఎక్స్ కాదు సర్ , మీరు అక్కడ నిజంగానే కూర్చున్నారు ! అని అంటుండేవారు. వీళ్ళందరికీ నేను ఎక్స్ప్లైన్ చేయాలంటే , మొత్తం ఆర్.ఆర్.ఆర్ టీంను తీసుకువెళ్ళాలి (నవ్వుతూ))

కస్టమర్ మీట్ నిర్వహించిన హెచ్ఆర్ఎంఎస్ ప్రదాత గ్రేటిహెచ్ఆర్

నవతెలంగాణ-హైదరాబాద్: ఫుల్-స్థాయి హెచ్ఆర్ఎంఎస్ ప్లాట్‌ఫారమ్ ప్రదాత అయిన greytHR, హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తమ కస్టమర్ మీట్‌ను నిర్వహించింది. greyt2gether పేరిట ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 20వ తేదీన హోటల్ గ్రీన్‌పార్క్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమం greytHR యొక్క కస్టమర్ అవసరాలు మరియు అంచనాలపై లోతైన అవగాహనను పొందడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం లో 115 కంటే ఎక్కువ మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం కంపెనీ గురించి సమగ్ర అవగాహన కల్పించటంతో పాటుగా దాని కస్టమర్‌లకు బ్రాండ్ greytHR అంటే ఏమిటో ప్రెజెంటేషన్‌తో ప్రారంభించబడింది. జననీ ప్రకాష్, హెడ్ - పీపుల్ కల్చర్, జెన్నియస్, "బిల్డింగ్ టుడే ఫర్ లీడింగ్ టుమారో" అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. greytHR బృందం కొత్త ఫీచర్ విడుదలను ప్రదర్శించింది మరియు ఇవి తమ కస్టమర్‌లకు ఎలా విలువను జోడిస్తాయో చూపారు.


ఆవు దూడను ముద్దాడితే చాలా...

- దేశంలో గోగుండాల దారుణాలపై చర్యలేంటి?
- మూకదాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న అమాయకపు ముస్లింలు
- అయినా పట్టని మోడీ సర్కారు, బీజేపీ ప్రభుత్వాలు
- సామాజికవేత్తలు, ప్రజాసంఘ నాయకుల ఆందోళన





న్యూఢిల్లీ : ప్రధాని మోడీ ఇటీవల ఒక ఆవుదూడను ముద్దాడిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఆ ఆవుదూడకు దీప్‌జ్యోతి అని పేరు పెట్టారు. సోషల్ మీడియా వేదికగా స్వయంగా మోడీ ఈ వీడియోను ప్రజలతో పంచుకున్నారు. బీజేపీ, హిందూత్వ శ్రేణులను ఈ వీడియో విపరీతంగానే ఆకట్టుకున్నది. మరికొందరు ఇది మోడీ పీఆర్ టీం ప్రచార తంతుగా అభివర్ణించారు. హర్యానా, జమ్మూకాశ్మీర్ ఎన్నికల్లో హిందువుల ఓట్లను ప్రసన్నం చేసుకోవటానికే మోడీ ఇలా ఆవుదూడ వీడియోను సామాజిక మాధ్యమాల్లోకి వదిలారని అంటున్నారు. నోరులేని మూగజీవమైన ఆవుదూడపై ప్రేమ చూపిస్తున్న మోడీ.. దేశ ప్రజలందరికీ ప్రధానిగా ఉన్న ఆయన భారత్‌లో గోరక్షణ పేరిట గోగూండాలు ఒక వర్గం వారి మీద జరుపుతున్న దారుణాలు, మూకదాడులపై ఎందుకు స్పందించటం లేదని సామాజికవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, ఆయా రాష్ట్రాల్లో బీజేపీ సర్కారులు గోగుండాలు, హిందూత్వ సంస్థల నాయకుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తూ దేశంలో హింసాత్మక పరిస్థితులకు దారి తీస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



2014 నుంచి 50 వరకు ఘటనలు

అల్ జజీరా వార్తా కథనం ప్రకారం 2014 మోడీ కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆవుకు సంబంధించిన విషయంలో ముస్లింలపై దాదాపు 50 వరకు మూకదాడులు జరిగాయి. ఈ ఘటనల్లో పలువురు బాధితులు పేద కుటుంబాలకు చెందినవారు, రోజువారీ కూలీలే కావటం గమనార్హం. ఫలితంగా బాధిత కుటుంబాల భవిష్యత్తు అంధకారంలో మునిగిపోతున్నది. ఇలా గోగుండాలు జరిపిన ఇలాంటి మూకదాడుల్లో దాదాపు ఏ ఘటనల్లోనూ ఆవు మాంసం లభించిన దాఖలాలు లేకపోవటం గమనించాల్సిన అంశం. కానీ, బీఫ్ తరలింపు అనుమానాల నేపథ్యంలో గోరక్షకులు జరిపే దాడుల్లో ముస్లింలు తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఇక యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా వంటి రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలైతే అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయి. బీఫ్‌ను కలిగి ఉన్నారన్న ఆరోపణలపై కొందరి ఇండ్ల మీద బుల్డోజర్‌ను ప్రయోగించిన సందర్భాలూ ఉన్నాయని సామాజికవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు గుర్తు చేస్తున్నారు.

దేశంలో ఇంత పెద్ద ఎత్తున గోరక్షకుల దారుణాలు జరుగుతున్నప్పటికీ ప్రధాని స్థాయిలో ఉన్న మోడీ నోరు తెరవకపోవటాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. ఆవుదూడను ముద్దాడటం ద్వారా హిందువుల ఓట్లను గంపగుత్తగా పొందొచ్చనుకుంటున్న మోడీ.. ఆ ఆవు పేరుతో దాడులకు గురైన ముస్లింల ఆగ్రహానికి గురవతామనే విషయాన్ని ఎందుకు విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల గోగూండాల దాడులు

పశ్చిమ బెంగాల్‌లోని ఫరీదాబాద్‌లో ఆగస్టు నెలలో గోరక్షకులు రెచ్చిపోయారు. ఛర్కీ దాద్రి పట్టణంలో షబీర్ మాలిక్ (26) అనే యువకుడిని బీఫ్ తీసుకున్నాడన్న అనుమానంపై హిందూత్వ శక్తులు కొట్టి చంపాయి. బెంగాల్ వలస కూలీ అయిన షబీర్ మాలిక్ మరణంతో ఆయన భార్య, రెండేండ్ల కుమారుడు ఒంటరివారయ్యారు. ఈనెల 3న 72 ఏండ్ల ముస్లిం వృద్ధుడి పైనా హిందూత్వ కార్యకర్తలు రెచ్చిపోయారు. బీఫ్‌ను తీసుకెళ్తున్నాడని ఆరోపిస్తూ సదరు వృద్ధుడిపై దాడికి దిగారు. అలాగే యూపీలోని అమ్రోహాలో అయితే ఒక స్కూల్ చిన్నారి టిఫిన్ బాక్స్‌లో బిర్యానీ తీసుకొచ్చాడన్న కారణంతో సదరు స్కూల్ ప్రిన్సిపాల్ ఆ చిన్నారిని స్కూల్ నుంచి బహిష్కరించాడు.

మాంసమని తెలిస్తే చాలు.. వారిపై దాడులే

ఇలాంటి ఘటనలను చూస్తే ఒక్క బీఫ్ మాత్రమే కాదు.. మాంసాహారమేదైనా ముస్లింలపై దాడులకు కారణమవుతున్నదని సామాజికవేత్తలు అంటున్నారు. తిండిపేరుతో ఒక వర్గంపై దాడులకు దిగటం, కఠిన చర్యలు తీసుకోవటం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. మందు, మాంసాహారం ప్రత్యేకించి ఒక వర్గం వారు మాత్రమే తీసుకోరనీ, హిందువులు కూడా వీటిని తీసుకునేవారి జాబితాలో ఉన్నారని అంటున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (2019-21) ప్రకారం భారత్‌లో మాంసం వినియోగం రోజురోజుకూ పెరిగిపోతున్నది. వారంలో కనీసం ఒక్కరోజైనా తాము చేపలు, చికెన్, ఇతర మాంసాన్ని తీసుకుంటామని 45.1 శాతం మంది మహిళలు, 57 శాతం మంది పురుషులు ఈ సర్వేలో వెల్లడించటం గమనార్హం. సాక్షాత్తూ ప్రభుత్వ సర్వే గణాంకాలే మాంసం వినియోగంపై వాస్తవాలను బయటపెడుతున్నాయనీ, అలాంటపుడు ఆహారం పేరుతో ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయటం ఎంత వరకు కరెక్ట్ అని వారు ప్రశ్నిస్తున్నారు.


'ప్రభుత్వాలు కఠిన నిబంధనలు తేవాలి'

గోరక్షణ పేరుతో గోగుండాలు, హిందూత్వ కార్యకర్తల చర్యలు పరాకాష్టకు చేరుకున్నాయని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. బీఫ్ తరలిస్తున్నారన్న అనుమానంపై ముస్లిం అనుకొని బ్రాహ్మణుడైన హిందూ వ్యక్తిని చంపిన ఘటనలు కూడా దేశంలో ఉన్నాయని వారు ఉదహరిస్తున్నారు. కాబట్టి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి విషయాల్లో కఠిన నిబంధనలు తీసుకురావాలనీ, ఒక వర్గాన్ని తినే తిండి పేరుతో లక్ష్యంగా చేసుకునే చర్యలను నియంత్రించాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.



తిరుమల వెళితే జగన్ డిక్లరేషన్ ఇవ్వాల్సిందే

- విలేకరుల సమావేశంలో చంద్రబాబు



అమరావతి: ప్రతిపక్షనాయకుడు జగన్మోహన్‌రెడ్డి తిరుమల వెళ్లితే దేవాలయ సంప్రదాయం ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం యంత్రం రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల అంశంపై జగన్ చేసిన ఆరోపణలను ఖండించారు. గత ఐదేళ్లలో డిక్లరేషన్ ఇవ్వలేదని జగన్ చెప్పడం సంప్రదాయా లను, చట్టాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. దీనికి ఆయన సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని తెలిపారు. అన్యమతస్తులు ఎవ్వరు తిరుమలకు వెళ్లినా డిక్లరేషన్ ఇవ్వడం సాంప్రదాయమని అన్నారు. జగన్‌కు కూడా అదే వర్తిస్తుందని చెప్పారు. 'ముఖ్యమంత్రిగా వెళ్తే ఎవ్వరూ ఏమీ అడగరు. అంతమాత్రాన అంగీకరించినట్లు కాదు. నిబంధనల ను పాటించడం బాధ్యత' అని అన్నారు. తనను తిరుమల వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నా రన్న జగన్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ జగన్‌ను తిరుమలకు వెళ్లవద్దని ఎవరూ చెప్పలేదని అన్నారు. ర్యాలీలు, జన సమీకరణలు చేయవద్దని, సాంప్రదాయాలు పాటించాలని మాత్రమే చెప్పామని తెలిపారు. తిరుమలకు వెళ్లవద్దంటూ జగన్‌కు పోలీసులు ఏమైనా నోటీసులు ఇచ్చారా? అని ఆయన ప్రశ్నించారు. ఇస్తే చూపించాలని అన్నారు. డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టం లేకే జగన్ వెళ్లడం లేదన్నారు. గతంలో జమ్మూకాశ్మీర్ సిఎం వచ్చినప్పుడు డిక్లరేషన్ ఇచ్చివ వెళ్లారని పేర్కొన్నారు. 'మనది సెక్యులర్ దేశం. మత సామరస్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలిగాని మనో భావాలు దెబ్బతీసేందుకు కాదు.' అని చంద్రబాబు అన్నారు.

మీరు ఎలా చెబుతారు?

. 'ఎఆర్ డెయిరి ఎనిమిది ట్యాంకర్లు పంపింది. వాటిలో నాలుగింటిని వాడారు. ఎక్కడ వాడారన్నది తరువాత. మిగిలిన నాలుగింటిలో నెయ్యిని టెస్ట్‌కు పంపారు. కల్తీ జరిగినట్లు వచ్చింది. వాటిని వెనక్కి పంపారు. నివేదిక ఇచ్చింది ఎన్‌డిడిబి, మేం కాదు. అంటే అర్థం ఏమిటి? వాడిన నెయ్యిలో కూడా కల్తీ ఉందనే కదా! లేదని మీరు ఎలా చెబుతారు?' అని జగన్‌మోహన్‌రెడ్డి నుద్దేశించి చంద్రబాబు ప్రశ్నించారు. 'ఇట చెప్పలేదు. నివేదికలు లేవు' అంటూ అబద్దాలు చెబుతున్నారని అన్నారు. టెండర్లు పిలవడానికి ఎందుకు కండీషన్లు ఎందుకు మార్చారన్నారు. ట్రేడర్లను మార్చి నాసిరకం నెయ్యి సరఫరా చేశారని అన్నారు. అనుమానం వస్తే టెస్టుకు పంపించొచ్చని కాంట్రాక్టులో ఉందని, దాన్ని ఓవో చేశారని అన్నారు. జగన్ వ్యాఖ్యలు ఎన్‌డిడిబి రిపోర్టునూ తప్పుబట్టే విధంగా ఉందని పేర్కొన్నారు. రిపోర్టును బయటపెట్టకపోతే తాము తప్పుచేసిన వారిగా మిగిలిపోతామని, అందువల్లే బయట పెట్టామని చెప్పారు. ప్రతి ఏడాది ఆగస్టు 15 తరువాత పవిత్రోత్సవాలు చేస్తారని, ఈ ఏడాది శాంతియాగం కూడా చేశారని తెలిపారు.

తిరుపతిలో టెన్షన్... టెన్షన్

- జగన్ పర్యటనను అడ్డుకుంటామన్న బిజెపి, జనసేన
- భారీగా పోలీసుల మోహరింపు
- డిక్లరేషన్ పేరుతో తిరుపతిలో వెలిసిన బోర్డులు
- పర్యటన రద్దుతో ఊపిరిపీల్చుకున్న పోలీసులు

తిరుపతి : తిరుపతిలో శుక్రవారం ఉదయం నుంచి టెన్షన్ వాతావరణం నెలకొంది. ఒకవైపు తిరుమల దర్శనానికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని ప్రకటించడం, మరోవైపు ఆయన పర్యటనను అడ్డుకుంటామని ఇది వరకే బిజెపి, జనసేన నాయకులు హెచ్చరించడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు భారీగా తిరుపతికి చేరుకున్నారు. తిరుమలలో 1000, అలిపిరి వద్ద 1500, ఎయిర్‌పోర్టు వద్ద 1500 మంది మోహరించారు. చివరి నిమిషంలో జగన్ పర్యటను రద్దుకావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. 'శుక్రవారం ఉదయం శ్రీవారి దర్శనానికి వస్తున్నాను.. వైసిపి శ్రేణులు ఎవ్వరూ హడావిడి చేయొద్దు' అని ట్విట్టర్‌లో జగన్‌హన్‌రెడ్డి ట్వీట్ చేయడంతో టిడిపి కూటమి నాయకులు అత్యవసరంగా సమావేశమై శ్రీవారి దర్శనానికి వస్తున్న జగన్‌ను అడ్డుకోరాదని, శ్రీవారి లడ్డూ కల్తీపై శాంతియుతంగా నిరసన తెలుపుతామని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ టిడిపి తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, జనసేన నగర ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. అన్యమతస్తులు శ్రీవారిని దర్శించుకోవాలంటే దేవాదాయ శాఖ యాక్ట్ 311 ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాలని టిటిడి ఇఒ శ్యామలరావు పేరుతో శుక్రవారం బోర్డులు వెలిశాయి. చివరికి జగన్ పర్యటన రద్దు కావడంతో టిటిడి ఈ బోర్డులను తొలగించింది. వైసిపి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, వైసిపి కార్యకర్తలకు పోలీసులు ముందుగానే నోటీసులు పంపారు. జిల్లావ్యాప్తంగా 30 యాక్ట్ అమల్లో ఉందని, వచ్చే నెల 29 వరకూ ఎవరూ ర్యాలీలు, బహిరంగసభలు నిర్వహించరాదని, నలుగురైదుగురి కన్నా గుమిగూడి ఉండరాదని నోటీసులో పేర్కొన్నారు.

ఓ భక్తుడిలా జగన్ వస్తుంటే అడ్డుకుంటున్నారు : కరుణాకర్‌రెడ్డి

శ్రీవారిని దర్శించుకునేందుకు ఓ భక్తుడిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తుంటే టిడిపి కూటమి నేతలు అడుగడుగునా అడ్డుకుంటున్నారని టిటిడి బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు.

టీటీడీ హైజాక్‌కు కేంద్రం కుట్ర

- మత రాజకీయాలను బీజేపీ రెచ్చగొడుతోంది
- సీఎం, డిప్యూటీ సీఎం ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలి : సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు



రాష్ట్ర స్థాయి రైతు సదస్సులో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు

ఏలూరు : తిరుమల తిరుపతి దేవస్థానాన్ని (టిటిడిని) హైజాక్ చేసి తన గుప్పెట్లోకి తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీన్ని అడ్డుకోకపోతే భవిష్యత్తులో శ్రీశైలం, ద్వారకాతిరుమల, విజయవాడ కనకదుర్గ ఆలయాలతోపాటు రాష్ట్రంలోని అన్ని దేవాలయాలనూ తన వశం చేసుకుని పెత్తనం చేస్తుందని ఎపి రైతు సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ అధ్యక్షతన ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో రాష్ట్ర స్థాయి రైతు సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తొలిరోజు వి.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. టిటిడిలో నెలకొన్న లడ్డూ సమస్య మతం రంగు పులుముకుని ఉన్మాదంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రులు తమ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుండగా, బిజెపి నాయకులు సిబిఐకి అప్పగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. రూ.వేల కోట్లు ఆదాయం వచ్చే టిటిడిని లాగేసుకోవాలని చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కుంపటి రగిలించి మత రాజకీయాలు చేయాలని బిజెపి చూస్తోందన్నారు. పార్టీల మధ్య గొడవ మత రాజకీయాల కుట్రకు దారి తీస్తోందని, ఇది దేశానికి మంచిది కాదని తెలిపారు. సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్ ఏ ఉద్దేశంతో చెబుతున్నారో అర్థం కావట్లేదన్నారు. సంప్రదాయాలను అందరూ గౌరవించాలని, అదే క్రమంలో వర్ణాశ్రమం, అంటరానితనం, స్త్రీల పట్ల వివక్ష వంటి వాటిని వ్యతిరేకించాలని పేర్కొన్నారు. అంతేతప్ప, 'మేము శాసిస్తాం. మీరు అమలు చేయండి' అనే రీతిన ఉండకూడదన్నారు. రాష్ట్రంలోని నాయకులు కేంద్రానికి అవకాశం ఇచ్చే విధంగా మాట్లాడవద్దని హితవు పలికారు.

దీన్ని పవన్‌కల్యాణ్, ఆయన అనుచరులు గుర్తించాలని, రాష్ట్రాన్ని యుపీగా మార్చే అవకాశం ఇవ్వకూడదని అన్నారు. రాష్ట్రంలో ప్రజల మధ్య శాంతి, సామరస్యాలు ఉన్నాయని తెలిపారు. వాటిని చెడగొట్టి మతోన్మాద విస్తరణకు అవకాశం ఇవ్వకూడదన్నారు.

రైతు ఆదాయం పెరిగితేనే దేశాభివృద్ధి

మోడీ ప్రభుత్వ విధానాలు రైతులను చిదిమేస్తున్నాయని వి.శ్రీనివాసరావు తెలిపారు. కంగనా రనౌత్ మాటలు బిజెపి నాయకులకు రైతులపైగల ద్వేషానికి నిదర్శనమన్నారు. దేశం అభివృద్ధి చెందుతోందంటూ మోడీ చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలని తెలిపారు. రైతు సంపద ఎక్కడ పెరిగిందని ప్రశ్నించారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లోకి వెళ్తోందన్నారు. గిట్టుబాటు ధర చట్టం చేసి అమలు చేస్తానని చెప్పిన మోడీ... రైతులను మోసం చేశారని వివరించారు. కార్పొరేట్ల కోసం రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారన్నారు. గిట్టుబాటు ధర చట్టం చేసి దానిని అమలు చేయని వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రైతుల ఆదాయం పెరిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. 30 ఏళ్ల క్రితం వ్యవసాయ రంగంలో 62 శాతం మంది ఉండేవారని, ఇప్పుడు అది 50 శాతానికి పడిపోయిందని తెలిపారు. రాష్ట్రంలో ఈ పదేళ్లలో నాలుగున్నర లక్షల ఎకరాల వ్యవసాయ భూమి తగ్గిపోయిందన్నారు. ఇది అభివృద్ధా? వినాశనమా? అని ప్రశ్నించారు. సహకార, పంచాయతీ వ్యవస్థలను కేంద్రం తమ చేతుల్లో పెట్టుకుంటోందని, రైతులు తమ హక్కుల కోసం పోరాడితే కేసులు పెడుతోందని తెలిపారు.

వాచ్‌మెన్లపైకి రోడ్డు రోలర్

- అక్కడికక్కడే ఇద్దరూ మృతి





అష్రఫ్ (ఫైల్) సాదిక్

చిత్తూరు : కడు పేదరికంలో ఉన్న కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు తమ ఊరికి సమీపంలోని రహదారి నిర్మాణ పని చేస్తున్న కంపెనీలో రాత్రి వాచ్‌మెన్‌గా పనికి చేరారు. పగటిపూట వారిలో ఒకరు వ్యవసాయ పనులు, ఇంకొకరు స్కూటర్ మెకానిక్ పనిచేస్తున్నారు. తమ కుటుంబాలకు ఆసరాగా ఉంటున్నారు. పని ప్రదేశంలో వారిని రోడ్ రోలర్ రూపంలో మృత్యువు కబళించింది. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామం వద్ద ఓ కంపెనీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తోంది. అదే గ్రామానికి చెందిన అవివాహితులైన అష్రఫ్ (24), సాదిక్ (26) ఆ పనుల వద్ద నైట్ వాచ్‌మెన్లుగా ఏడాదిన్నరగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ఎప్పటిలానే విధులకు వెళ్లారు. అర్ధరాత్రి రెండు గంటల వరకూ అక్కడి పరికరాలు, యంత్రాలు, పనులకు కాపలా ఉన్నారు. ఆ తర్వాత వారికి రెప్పలు వాలడంతో సమీపంలోని మట్టి దిబ్బ ప్రదేశంలో కునుకుతీశారు. లైట్ వెలుతురులో రోడ్డు పనులు చేస్తున్న రోడ్ రోలర్ అటుగా వచ్చింది. నిద్రిస్తున్న యువకులను గుర్తించని రోలర్ డ్రైవర్ వారిపైకి దూసుకెళ్లాడు. దీంతో, యువకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకొని ఇద్దరి మృతదేహాలను చూసి గుండెలవిసేలా విలపించారు. కుటుంబాలకు చేదోడువాదోడు నిలిస్తూ అందరితో సఖ్యతగా ఉంటున్న యువకుల మృతితో గ్రామం శోకసంద్రమైంది. సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ మురళీమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.